## డిజిటల్ యుగంలో పేరెంటింగ్‌పై గీతంలో అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గీతం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో "ఎంపవరింగ్ ఉమెన్ పేరెంటింగ్ ఇన్‌ఎ డిజిటెల్ వరల్డ" అనే అంశంపై సోమ వారం 23న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ శిశు మానసిక వైద్య నిపుణుడు 40 సంవత్సరాలకు పైగా శిశు మానసిక ఆరోగ్య రంగంలో అనుభవం కలిగిన డా.శేఖర్ శశిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదం డ్రులు పిల్లలతో భావోద్వేగపూర్వక సంబంధం పెంపోందించుకుంటే వారి మొబైల్ స్క్రీన్ టైమ్‌ను తగ్గించవచ్చునని ఆయన పేర్కొన్నారు. పిల్లలపై కఠిన నియంత్రణలు విధించడం కంటే స్క్రీన్ టైమ్‌కు బదులుగా ఇతర సృజనాత్మక కార్యకలాపాలను అలవాటు చేయాలని ఆయన సూచించారు. బయట క్రీడలు, సరైన నిద్ర, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో పరస్పర సంబంధాలు చదువులు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలు పిల్లల సమగ్ర ఆరోగ్యానికి అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు.

### నిపుణులు సూచనలు ప్రకారం..

2 సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి స్క్రీన్ పరిచయం ఇవ్వకూడదు, 24-59 నెలల పిల్లలకు రోజుకు గరిష్టంగా ఒక గంటపాటు, అదీ తల్లిదండ్రుల పర్యవేక్షణలో మాత్రమే స్క్రీన్ టైమ్ ఇవ్వాలి. 7-12 సవంత్సరాల పిల్లలకు రోజుకు రెండు గంటలకు లోపుగా మాత్రమే స్క్రీన్ వినియోగం ఉండాలని ఆయన తెలిపారు. పిల్లలతో గౌరవప్రదమైన భాషలో మాట్లాడి, వారి భావోధ్వాగాలను గౌరవిస్తూ, నిరంతర స్క్రీన్ వినియోగం వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మూడు సంవత్సరాల వయస్సు నుంచే పిల్లలలో గ్రహించే శక్తి ఉంటుందని ఈ కారణంగా ఆట పాటల వంటి ఇతర వ్యాపకాలపై దృష్టి మరలేటట్లు చూడాలని ఆయన సూచించారు. గీతం మహిళా సాధికారిక విభాగం అధ్యక్షురాలు డా.టి. తళ్లూరి మాధవి అధ్యక్షత వహించగా డా.నివేధిత, డా.స్వాతి చిక్కాల సంధానకర్తలుగా వ్యవహరించారు.

## సౌత్ జోన్ చెస్ విజేతలుగా తమిళనాడు జట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాల యం వేదికగా గత మూడు రోజులగా జరుగు తున్న దక్షిణ మండల (సౌత్ జోన్) అంతర్ విశ్వ విద్యాలయాల మహిళల చదరంగం (చెస్) పోటీలను సోమవారం 23న ముగిసాయి. పోటీలలో దక్షిణ భారత దేశం నుంచి 80 విశ్వవిద్యాయాల జట్లు పాల్గొనగా తమిళనాడు విశ్వవిద్యాలయాల జట్లు పూర్తి ఆధిపత్య కనబరిచి వరస స్థానాలలో విజయం సాధించాయి. పోటీలలో అన్ని రౌండులు పూర్తి అయ్యేసరికి యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ప్రథమ విజేతగా, ఎస్.ఆర్.ఎమ్ విశ్వవిద్యాలయం ద్వితీయ విజేతగా, భారతీయార్ విశ్వవిద్యాలయం తృతీయ స్థానంలో, పెరియార్ విశ్వవిద్యాలయం నాలుగవ స్థానంలో నిలిచాయి. బహుమతి ప్రధానోత్సవ సభకు గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం కేంపస్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తీక్, లక్ష్మీభాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పిజికల్ ఎడ్యుకేషన్ డీన్ (గాల్వియర్) కృష్ణకాంత్ సాహు విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలకు ఛీఫ్ ఆర్బిట్రేటర్‌గా జి.వి.కుమార్, సహయ ఆర్బిట్రేటర్‌లుగా ప్రసాద్, శ్రీకాంత్‌లు వ్యవహరించారు. ఈ పోటీలకు లక్ష్మీభాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పిజికల్ ఎడ్యుకేషన్ డీన్ (గాల్వియార్) కృష్ణకాంత్ సాహు పరిశీలకులుగా వ్యవహరించారు. గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ జి.శ్రీనివాస్, గీతం క్రీడా విభాగం సీనియర్ మేనేజర్ కె.తపశ్వి విజేతలను అభినందించారు.

## ట్రాఫిక్ జామై.. ఇంటర్ విద్యార్థుల విలవిల

### చైతన్యనగర్ జోన్‌లో నిలిచిపోయిన వాహనాలు-పోలీసుల పర్యవేక్షణ లేక ఇబ్బందులు

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



ఇంటర్మీడియట్ పరీక్షల తొలిరోజైన సోమ వారం గాజువాకలోని చైతన్యనగర్ స్కూళ్లు, కళా శాలల జోన్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి రావడం తో ఉదయం నుంచే రహదారులన్నీ వాహనాలతో నిండి పోయాయి. స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో రద్దీ పెరిగి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు ఎక్కడా కనిపించకపోవడంతో విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. పరీక్షల సమయంలోనైనా ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం కావాలి

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు భాగ స్వాములు కావాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్య దర్శి జె.అయోధ్య రామ్ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న 'ప్రజా చైతన్య యాత్ర' సోమవారం స్టీల్‌ప్లాంట్ పరి పాలన భవనానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ మాఫియా యువత ను లక్ష్యంగా చేసుకుని అడ్డదారుల్లో పంపిణీ చేయడం ఆందోళనకరమన్నారు. ఉక్కు నగరంలోని యువత, కార్మిక కుటుంబాలను అప్రమత్తం చేసేందుకే ఈ యాత్రను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, నమ్మి రమణ, కంబాల మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## 5వ జాతీయ వీల్ చైర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన గండి బాబ్జి, బొడ్డేపల్లి రఘు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



గుళ్ళేపల్లి అవెన్యూ స్పోర్ట్స్ అరేనా క్రికెట్ మైదానంలో 5వ జాతీయ వీల్ చైర్ క్రికెట్ టోర్న మెంట్ సోమవారం చాలా ఘనంగా ప్రారంభిం చారు. 5వ జాతీయ వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్ అనకాపల్లి జిల్లా, సబ్బవరం మండలం, గుల్లేపల్లి లోని అవెన్యూ స్పోర్ట్స్ అరేనా వేదికగా ఫిబ్రవరి 23 నుండి 26 వరకు 5వ జాతీయ వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించబడుతోంది. ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్ ఘడ్, ఒడిశా రాష్ట్ర జట్లు పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ఈ టోర్నమెంట్‌లో ఉత్సాహభరితంగా పోటీ పడుతున్నారు. ఈ టోర్నమెంట్‌ను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ దివ్యాంగుల క్రికెట్ కమిటీ మరియు ఏపీ దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర క్రికెట్ అసోసి యేషన్ దివ్యాంగుల విభాగ క్రికెట్ కమిటీ చైర్మన్ సురవరపు సుబ్బారావు, సభ్యులు మరియు దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్ సభ్యులు యడ్లపల్లి సూర్యనారాయణ విశేషంగా కృషి చేస్తున్నారు. ముఖ్య అతిథులుగా (ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గండి బాబ్జి, ఏపీ మెడికల్ హైపవర్ కమిటీ సభ్యులు, ఏపీ వీల్‌చైర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు) హాజరై టోర్నమెంట్ ను డా.బొడ్డేపల్లి రఘు ప్రారంభించారు. నోడెక్స్ సంస్థ ప్రతినిధులు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులను ప్రోత్స హిస్తూ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రత్యేకంగా స్పోర్ట్స్ వీల్‌చైర్‌లను బహుకరించారు. ఆ వీల్ చైర్లను అతిధులు జట్టు సభ్యులకు అందచేశారు. అనంతరం అతిధులు వీల్ చైర్ క్రికెట్ క్రీడాకారుల ను ఉద్దేశించి మాట్లాడారు. నోడెక్స్ సంస్థ సభ్యులు దివ్యాంగులకు అందించే సహకారం క్రీడాకారులలో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ జాతీయ స్థాయి టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగుతూ, దివ్యాంగ క్రీడాకారుల ప్రతిభను దేశవ్యాప్తం గా చాటిచెప్పే వేదికగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రీడా పాలసీలో 2వ కేటగిరీలో ఉన్న క్రికెట్‌ను మొదటి కేటగిరీలోకి తీసుకువచ్చి దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులకు ఉద్యోగ భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని గండి బాబ్జి తెలిపారు. దివ్యాంగ క్రీడాకారులకు ప్రత్యేక ఉద్యోగ అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం అందచేయాలని డాక్టర్ బొడ్డేపల్లి రఘు దివ్యాంగ క్రీడా కారులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అవెన్యూ స్పోర్ట్స్ అరేనా సీఈఓ ఎం. వెంకటరమణ, శ్రీకాకుళం వీల్ చైర్ క్రికెట్ సంఘ అధ్యక్షులు కొట్టిస కిరణ్, ఉపాధ్యక్షులు జి.పి.నాయుడు, అవెన్యూ స్పోర్ట్స్ అరేనా క్రికెట్ మైదానం ఇంచార్జ్ భవాని శంఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక విభాగపు అధికారులతో ..

7వ పేజీ తరువాయి ..

తొలగింపు ఈ నెల 24 నుండి తక్షణమే ప్రారంభించాలని, 11 కేవీ విద్యుత్ స్తంభాల మార్పిడి పనులు మార్చి 15వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ఈకో-సెన్సిటివ్ జోన్ పరిధిలో పనులు ఆలస్యం కాకుండా చేపట్టాలని, రక్షిత అటవీ ప్రాంత పరిధి (1.8 కి.మీ)లో పనులు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన తరువాత మాత్రమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువల నిర్మాణ పనుల కోసం 7 రోజుల్లో టెండర్లు పిలవాలని, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పరిహారాలను వీఎంఆర్డీఏ ప్రణాళిక విభాగం అధికారులు వెంటనే ప్రజలకు చెల్లించాలన్నారు. తాళ్లవలస నుండి కొత్తవలస రహదారి నిర్మాణంలో అంగీకారం పొం దిన కట్టడాలను వీఎంఆర్డీఏ అధికారులు తక్షణమే తొలగించాలని, స్పందించని యజమాను లకు నోటీసులు జారీ చేసి వారితో ప్రత్యక్షంగా చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. బోయపాలెం నుండి కాపులుప్పాడ రహదారి, వేపగుంట నుండి పినగాడి రహదారి టీడీఆర్ చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఆదివారం రహదారి నిర్మాణ పనులను డ్రోన్ ద్వారా చిత్రీకరించాలని నిర్ణయించారు. సంయుక్త కమిషనర్ రమేష్ ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ప్రధాన ప్రణాళికాధికా రిణి వి.శిల్పా, ఆర్డీఓ సంగీత్ మధుర్, పర్యవేక్షక ఇంజనీర్ ఈ భవానీ శంకర్, ప్లానింగ్ అధికారులు, ఎపియుఎఎంఐ ప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డి-పట్టా భూమి పేరుతో కొండలను తవ్వేస్తున్న పట్టించుకోని రెవెన్యూ అధికారులు

7వ పేజీ తరువాయి ..

అవుతుంది. ఇంత పెద్ద ఎత్తున గ్రావెల్ దందా సాగుతున్న అధికారులు మాత్రం ఎందుకు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పదవి చేపట్టిన వెంటనే అక్రమంగా గ్రావెల్ తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ అధికారులు మాత్రం ఎమ్మెల్యే మాటనే బేకాతర్ చేస్తూ వ్యవహరిస్తున్న తీరు చర్చనీయంగా మారింది. మరి రెవెన్యూ అధికారులు ఎవరి ఒత్తిడితో చర్యలు తీసుకోవడానికి ముందుకు రావటం లేదు. దీనిపై ఎమ్మార్వోను సంప్రదించగా నోటీసులు ఇచ్చామని చెబుతున్నారు. మరి ఇప్పటివరకు తవ్వుకున్న దానికి ఏ చర్యలు చేపడతారని అనగా సమాధానం దాటవేస్తున్నారు.

## విశాఖ 'హోమీబాబా'లో అరుదైన చికిత్స

7వ పేజీ తరువాయి ..

ఆమె 'ఈటీఎంఆర్'ను జయించినట్టేనన్నారు. వాస్తవానికి బాలిక ముంబయిలోనే ప్రాథమిక చికిత్స పొందగా ఆమె స్వస్థలం ఏపీ కావడంతో ఇక్కడ పూర్తి స్థాయిలో చికిత్స నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. దేశంలో ఇదే మొదటిది ఇప్పటి వరకు భారత దేశంలోనే ఇలాంటి అరుదైన చికిత్స అందజేసిన దాఖాలాలేవీ లేవని హోమీ బాబా ఆస్పత్రి నిర్వహకులు స్పష్టం చేశారు. ఇది విశాఖ యూనిట్ ఆస్పత్రి ఘనతేనన్నారు. దీంతో ఏపీ సహా పొరుగు రాష్ట్రాల్లో అత్యాధునిక, తీవ్రమైన కేన్సర్ చికిత్సలు అందించే సామర్థ్యానికి ఈ చికిత్సే నిదర్శనమన్నారు. '2025లో మాత్రమే 9వేలకు పైగా కొత్త రోగులు తమ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకున్నారని', అందులో 30బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్లు కూడా ఉన్నాయన్నారు. ఈ ప్రాంత రోగులు అత్యాధునికి కేన్సర్ చికిత్స కోసం ఇతర మహా నగరాలకు వెళ్లాల్సిన అవసరమే లేదని ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మొహంతి శెట్టి ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. పెడియాట్రిక్, మెడికల్ ఆంకాలజీ (బీఎంటీ సహా), హీమటో పాథాలజీ, ట్రాన్స్ఫ్యూషన్ మెడిసిన్ వంటి ప్రత్యేక విభాగాలతో పాటు 5పడకల బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ యూనిట్ ఇప్పటికే ఇక్కడ అందుబాట్లో ఉన్నాయన్నారు. పిల్లలు, బ్లడ్ కేన్సర్ చికిత్స కోసం 200 పడకలతో ప్రత్యేక నూతన భవనం తయారవుతోందని, 2027 నాటికి ఈ యూనిట్ ప్రారంభం కానుందన్నారు.

## విటారా ఎలక్ట్రిక్ వెహికల్‌ను ప్రారంభించిన యూబీఐ డీజీఎం

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం జె. సింహాచలం ఈ విటారా ఎలక్ట్రిక్ వెహికల్ ను వరుణ్ నెక్సా వద్ద ప్రారంభించారు. విశాఖపట్నం మార్కెట్లోకి మారుతి ఈ విటారా ఎలక్ట్రిక్ కారు వచ్చింది. సోమవారం జిల్లా కేంద్రంలోని బైపాస్ సిరిపురం జంక్షన్, దసపల్లా హిల్స్, నెక్సా షోరూంలో వరుణ్ మోటార్స్ నూతనంగా ప్రవేశపెట్టిన ఈ కారును యూనియన్ బ్యాంక్ డీజీఎం జె.సింహాచలంతోపాటు మారుతి ఏరియా మేనేజర్ సర్కార్ వరణ్ నెక్సా హెడ్ అబ్బాస్ ఖాన్ చేతులు మీదుగా ఆవిష్కరించారు.

## సొమ్ములిచ్చికో.. అక్రమ అంతస్తులు కట్టుకో..!

7వ పేజీ తరువాయి ..



31వ వార్డు కనకల దిబ్బ ప్రక్కన

అదే తంతు కనిపిస్తోంది. ఉద్యోగులుగా ప్రభుత్వం నుంచి నెల వారీ వేతనాలను పొందుతున్న 'ప్లానింగ్' విభాగం సిబ్బంది.. అనధికార నిర్మాణాలను ప్రోత్స హిస్తూ.. అక్రమ సంపాదనతో జేబులు నింపుకుంటున్నారు. కనీసం ప్రజలకు జవాబుదారీ తనంగా వుండాల్సిన ప్రభుత్వ సేవకులకు అదేమీ పట్టకుం డా.. అవినీతి సొమ్ములను సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. మరోపక్క ఆయా కట్టడాలపై ఎవరు ఫిర్యాదు చేసిన తన దృష్టికి రాలేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తుండడం విశేషం. బీపీఎస్ ముసుగులో అవినీతి కట్టడాలను ప్రోత్సహిస్తూ.. లక్షలాది రూపాయలతో జేబులు నింపుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ జేబులు నింపుకోవడంలో.. ప్లానింగ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అక్రమ నిర్మాణాల జోరు..



38వ వార్డు టౌన్‌హాల్ రోడ్డులో

'సౌత్' జోన్‌లో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాల జోరు కనిపిస్తోంది. స్థానిక 33వ వార్డు, అల్లిపురం, అస్సాంగార్డెన్‌లో ఓ భారీ భవనానికి అక్రమ అంత స్తులు వేయించడం... ఫిర్యాదులు రావడంతో ఆ అదనపు అంతస్తుకు చిన్నపాటి కన్నాలు కొట్టి మ.మా అనిపిం చడం జరిగిపోయింది. ఇప్పుడా ఆ భవనానికి మేకాప్ కూడా చేసేయడం జరిగిపోయింది. 31వ వార్డు పరిధిలోని కనకలవీధి పక్కన గతంలో కూలిపోయిన పాత మాధవ్ టవర్ భవనం స్థలంలో అనుమతి లేకుండా షెడ్లు నిర్మిస్తున్నా.. ప్లానింగ్ యం త్రాంగం మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరి స్తోంది. 27వ వార్డు పరిధిలోని డైమండ్ పార్కు పక్కన ఓ బార్ అండ్ రెస్టారెంట్ లో అక్రమంగా ఐరన్ పోల్స్ వేసి మరీ.. మూడంతస్తుల భారీ భవ నాన్ని నిర్మిస్తున్నా, వాటిపై ఫిర్యాదులందినా సరే అవినీతి మత్తులో కూరుకుపోయిన ప్లానింగ్ సిబ్బంది ప్రేక్షకపాత్ర వహిస్తున్నట్టు తెలుస్తోంది. 33వ వార్డు పరిధి కుమ్మరివీధిలో అక్రమంగా అదనపు అంతస్తును నిర్మిస్తున్నా.. ప్లానింగ్ సిబ్బంది కళ్ళకు కనిపించకుండా పోయింది. 38వ వార్డు పరిధి టౌన్‌హాల్ రోడ్డు, సాయిబాబా ఆలయం వద్ద అదనపు నిర్మాణం జరుగుతున్నా.. అవినీతి మత్తులో కూరుకుపోయిన సిబ్బంది అటువైపు కన్నెత్తికూడా చూడలేకపోతున్నారట. ఎందుకంటే.. ప్రతి అక్రమ నిర్మాణానికి ఒక్కో ప్యాకేజీ వుందనే వాదన ఈ సౌత్ జోన్‌లో కనిపిస్తోంది. ఒక్కొక్క ఫ్లోర్‌కు దాదాపు రూ.5 లక్షల చొప్పున తీసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా.. వాటిపై చర్యలకు వెనుకంజ వేస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.

### రాతపూర్వకంగా ఇస్తేనే చర్యలట!

నెల వారీ వేతనాలను తీసుకుంటూ.. ప్రభుత్వ సేవలకులుగా వుండాల్సిన సిబ్బంది... అవినీతి సొమ్ములకు దాసోహమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణా లను నియంత్రిస్తూ.. భవనాలను సక్రమంగా నిర్మించే విధంగా చర్యలు చేపట్టాల్సిన సౌత్ ప్లానింగ్ యంత్రాంగం కొత్తవాదనను తెరపైకి తెస్తున్నారు. కళ్ళకు గంతలు కట్టుకొని మరీ.. తమకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే అటువైపు చూస్తామంటూ సాక్ష్యాత్తు ఆ జోనల్ ప్లానింగ్ బాస్ చెప్పడం చూస్తుంటే.. ఎంతటి అవినీతిలో కూరుకుపోయారో అన్నది ఇట్టే అవగతమవుతోంది.

## వివాదస్పదమైన భూములకు సంబంధించి..

7వ పేజీ తరువాయి ..

హాజరైనప్పటికీ పట్టాదార్ పాస్ పుస్తకాలు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులు పలు దఫాలుగా విచారణ కాక పోవడంతో ఏపీ పట్టాదారు పాస్ పుస్తకాల హక్కు చట్టం ద్వారా రికార్డులు సృష్టించుకున్న వారికి వారికి ఏ విధంగా సంక్రమించింది ..ఆధారాలు లేకపోవడం.. ప్రస్తుతం భూమిపైన లేకపోవడం పరిగణించి సరైన ఆధారాలు చూపించక పోవడంతో జాయింట్ కలెక్టర్ సవరణ అధికారి ఆధీనంలోకి ఉంచి ఖాతా నెం.1415లో గల పట్టాదార్ పాస్ పుస్తకా లను రద్దు చేస్తున్నట్లు ఆర్డీవో కార్యాలయం ద్వారా నోటీసులు అందజేసినట్లు ఫిర్యాదు దారులైన కల్లేపల్లి వెంకటపతి రాజు, నాగరాజులతోపాటు పలువురు స్థానిక విలేకరులకి తెలిపారు. అధికారులు స్పందించి ఇటువంటి నిర్ణయం తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 120 ఫిర్యాదులు స్వీకరించిన సీపీ శంఖబ్రత బాగ్చి

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి నేతృత్వంలో ప్రతి సోమవారం నిర్వహిం చబడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ఎస్) కార్యక్రమంలో సోమవారం 120 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నివేదించారు. నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర సబ్-డివిజన్ ఏ.సి.పీలు, పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్లు, ఎస్పైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని, ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులు పరిశీలించిన డా.భాగ్చి ఫిర్యాదు దారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం, సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలసి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల వేగవంతమైన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిఫారసు చేశారు.సోమవారం స్వీకరించిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య-భర్తల గొడవలు, మోసం, సివిల్ కేసులు ప్రధానంగా ఉన్నాయి. ప్రముఖంగా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజల సమస్యలు నేరుగా పోలీసులు వినే, సమగ్ర పరిష్కారం అందించే ఒక ప్రభావవంతమైన వేదికగా నిలిచింది.

## కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవేరుల కళ్యాణోత్సవాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



వన్ టౌన్ ప్రాంతంలో గల కన్యకాపరమేశ్వరి దేవాలయం (బాలాలయం) లో నగరేశ్వర స్వామి జనార్దనస్వామి దేవేరుల పరిణయ మహోత్సవములు ఘనంగా నిర్వహించుచున్నట్లు దేవాలయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్, పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమా వెంకట బాలాజికుమార్‌లు తెలిపారు. 27వ తేది నుంచి మార్చి 3వ తేది వరకు నిర్వహించు శ్రీ నగరేశ్వరస్వామి-వింధ్య వాసిని, శ్రీ జనార్ధనస్వామి- కోన కమలాదేవిలిల పరిణయ కార్యక్రమం యావత్తు శైవాగమ విద్వాన్ చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణ శర్మ, చంద్రమౌళి మల్లీశ్వరి శర్మ బ్రహ్మత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు రాంబిల్లి బుచ్చి భాస్కర కుమారశర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించుచున్నట్లు పరిణయ మహోత్సవ ముల ఆహ్వాన కమిటీ అధ్యక్షులు సుగ్గు విజయకుమార్, పెంటపాటి సోమరాజు తెలిపారు.

### పరియణాల నేపథ్యం

దేవాలయ ప్రధాన అర్చకులు ఆర్‌బిబి కుమార్ శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వము ఆర్యవైశ్య ఋషులు చేసిన తపస్సుకు మెచ్చి పార్వతీ పరమేశ్వరులు ఆర్యవైశ్యుల నివసించు నగరంలో నగరేశ్వరుడు, వింధ్యవాసిని గాను విష్ణుమూర్తి, లక్ష్మీదేవిలు జనార్ధన స్వామి, కోన కమలాదేవిగా వెలసి ఆర్యవైశ్యులందరినీ రక్షించగలమని వరమొసంగిరి. ఆ కారణము వలన ప్రతి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రతీ సంవత్సరం శివపార్వతులు విష్ణుమూర్తి లక్ష్మీదేవిలకు ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుండి వారం రోజులపాటు వార్షిక కళ్యాణ మహోత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. కన్యకాపరమేశ్వరి దేవాలయాల్లో మాత్రమే శివకేశవులకు ఒకేసారి వివాహమహోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. నగరంలోని ఆర్యవైశ్యులందరూ ఈ పరిణయ కార్యక్రమాల్లో పాల్గొని దేవేరుల కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

## 'గ్రేటర్' ఆపరేషన్స్ లంగ్స్ 3.0 ప్రారంభం

### సెల్లార్ లలో ఆక్రమణల తొలగింపు : జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో పలు జోన్ల పరిధిలో ఆపరేషన్ లంగ్స్ 3.0లో భాగంగా సెల్లార్ / స్టిల్ట్ ఫ్లోర్‌లలో ఆక్రమించిన 7 ఆక్రమణలను సోమవారం తొలగించడం జరిగిందని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు తెలిపారు. మహా విశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నగర పరిధిలో ప్రజలు, వాహన దారులు రోడ్లపై, ఫుట్ పాత్‌లపై, బహిరంగ ప్రదేశాలలో వారి వారి వాహనాలను పార్కింగ్ చేస్తున్నందు వలన రోడ్లు ఇరుకునకు గురై ట్రాఫిక్ నకు అంతరాయం కలుగు తున్నందున ప్రజలు, వాహనదారుల ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సౌకర్యార్థం వాణిజ్య సముదాయాలు, పలు అపార్ట్మెంట్‌లలో సెల్లార్ / స్టిల్ట్ ఫ్లోర్‌లను పూర్తిగా కేవలం వాహనాలు నిలుపుకొనే సౌకర్యార్థం ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ఆపరేషన్ లంగ్స్ 3.0 నేడు ప్రారంభించి నాలుగు జోనులలో 7 సెల్లార్ / స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీస్ వారి సహకారంతో తొలగిం చడం జరిగిందని ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి తెలిపారు. ఆపరేషన్ లంగ్స్ 3.0లో భాగంగా సౌత్ జోనులో 31వ వార్డు డాబాగార్డెన్స్‌లో ఒక కమ ర్షియల్ షాప్, ఈస్ట్ జోనులో 17వ వార్డు ఎం.వి.పి.కాలనీ, సెక్టార్-×లో కమర్షియల్ షాప్, వెస్ట్ జోనులో 90వ వార్డు గవరవీధిలో రెండు విజిటబుల్ షాప్, 91వ వార్డులో బుచ్చిరాజుపాలెం మెయిన్ రోడ్ వద్ద క్లోజేడ్ గ్రిల్స్‌ను, 66వ వార్డు గాజువాక మెయిన్ రోడ్డు నందు రెండు ఆక్రమణలు జిబిఆర్ షాపింగ్ మాల్ వద్ద షట్టర్, గోడలను తొలగించడం జరుగిందని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, GOTALA SRINIVASA RAO S/o. GOTALA APPARAO, previously called GUTALA SRINIVASA RAO R/o. 2-21, Rebaka, Bhatlapudi, Anakapalli, now changed my name from GUTALA SRINIVASA RAO to GOTALA SRINIVASA RAO. Henceforth I will be called as GOTALA SRINIVASA RAO for all purposes.

(Ro.No.44548)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
మర్రిపాలెం బ్రాంచ్-14261, డోర్ నెం. 38-40-18/1-3, మెయిన్ రోడ్ 104 ఏరియా, మర్రిపాలెం, విశాఖపట్నం, ఫోన్: 8928493775, ఇ-మెయిల్: ubin0810495@Unionbankofindia.bank

### APPENDIX IV [రూల్ - 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నంకు** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 2002 యొక్క 54) మరియు 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) నిబంధనల 2002 లోని నిబంధన 3తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని దిగువ పేర్కొన్న ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలకు నోటీసులో తెలిపిన బకాయి నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించమని కోరుతూ ఈ దిగువ తెలిపిన తేదీన డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది. సదరు బకాయి మొత్తాన్ని ఋణగ్రహీత/ హామీదారు /సహ-ఋణగ్రహీతలు చెల్లించనందు వలన క్రింద వివరించిన ఆస్తిని సదరు నిబంధనలులోని నిబంధన 8 తో చదువుకొనే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని **18.02.2026 తేదీన** క్రింది సంతకందారుడు లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డ్ ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు. సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదని మరియు ఒక వేళ ఎవ్వరైనా సదరు ఆస్తులతో వ్యవహారం చేసినచో ఋణగ్రహీత / హామీదారు / సహ-ఋణగ్రహీతలు చెల్లించాల్సిన బకాయి మొత్తం మరియు దానిపై గల వడ్డీ మొత్తాలకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మర్రిపాలెం** బ్రాంచ్ వారి ఛార్జీకి లోబడి ఉండునని ముఖ్యంగా ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీతలకు మరియు ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

క్రింది తెలిపిన అందరి ఋణగ్రహీతలు తనఖా పెట్టిన ఆస్తి యొక్క కామన్ షెడ్యూల్-ఎ : విశాఖపట్నం జిల్లా రిజిస్ట్రేషన్, విశాఖపట్నం జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కంచరపాలెం గ్రామం, విశాఖపట్నం అర్బన్‌లోని టీఆర్ ముత్యమాంబ కాలనీ, సర్వే నెంబర్ 41/4 లోని మొత్తం విస్తీర్ణం ఎ. 0.127 విస్తీర్ణంలోని భూమి.

**ఋణగ్రహీతలు, బకాయి, డిమాండ్ నోటీసు & స్వాధీనత నోటీసు తేదీలు మరియు ఆస్తుల వివరాలు**

**1.** ఋణగ్రహీత పేరు & చిరునామా : శ్రీ. దోలా శంకర్, తండ్రి: డి అప్పారావు.
చెల్లించవలసిన మొత్తం బకాయి : రూ. 3,80,710.00 (అక్షరాల మూడు లక్షల ఎనభై వేల ఏడు వందల పది రూపాయలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 13.11.2025 — స్వాధీనత నోటీసు తేది : 18.02.2026
స్థిరాస్తి వివరములు : షెడ్యూల్-బి : విశాఖపట్నం అర్బన్, టీఆర్ ముత్యమాంబ కాలనీ, కంచరపాలెం గ్రామం, సర్వేనెం. 41/4 లో మొత్తం బ్లాక్ ఏరియా 912 చ॥గ॥లోని భూమి అవిభాజ్యపు వాటా భూమి 19 చ॥గ॥లుతో బ్లాక్ నెం.B-1 లోని ఒక ఫ్లాట్ 365 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని అనుపాత వాటాతో కలిపి) మూడువ అంతస్తులోని ఫ్లాట్ నెం.TF-7 కలదు, సమీప డోర్ నెం. 35-36-1. బ్లాక్ హద్దులు (బ్లాక్ నెం.B-1) : **తూర్పు:** బ్లాక్ నెం: B-2, **పడమర:** బ్లాక్ నెం: C-1, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఎపి టిడ్కో. మూడువ అంతస్తులోని ఫ్లాట్ నెం: TF-7 హద్దులు: **తూర్పు:** వరండా, **పడమర:** శూన్యాకాశం, **ఉత్తరం:** TF-8, **దక్షిణం:** శూన్యాకాశం. (విశాఖపట్నం జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, డాక్యుమెంట్ నెం: 5321/2023, తేదీ: 09-06-2023 ప్రకారం శ్రీ. దోలా శంకర్ పేరున కలదు).

**2.** ఋణగ్రహీత పేరు & చిరునామా : శ్రీమతి గేదెల లక్ష్మి, భర్త: గేదెల రామస్వామి.
చెల్లించవలసిన మొత్తం బకాయి : రూ. 3,29,733.00 (అక్షరాల మూడు లక్షల ఇరవై తొమ్మిది వేల ఏడు వందల ముప్పై మూడు రూపాయలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 13.11.2025 — స్వాధీనత నోటీసు తేది : 18.02.2026
స్థిరాస్తి వివరములు : షెడ్యూల్-బి : విశాఖపట్నం అర్బన్, టీఆర్ ముత్యమాంబ కాలనీ, కంచరపాలెం గ్రామం, సర్వేనెం. 41/4 లో మొత్తం బ్లాక్ ఏరియా ఎ. 912 చ॥గ॥లోని భూమి అవిభాజ్యపు వాటా భూమి 19 చ॥గ॥లుతో బ్లాక్ నెం.B-1 లోని ఒక ఫ్లాట్ 365 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని అనుపాత వాటాతో కలిపి) మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.FF-9 కలదు, సమీప డోర్ నెం. 35-36-1. బ్లాక్ హద్దులు (బ్లాక్ నెం.B-1) : **తూర్పు:** బ్లాక్ నెం: B-2, **పడమర:** బ్లాక్ నెం: C-1, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఎపి టిడ్కో. మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం: FF-9 హద్దులు: **తూర్పు:** వరండా, **పడమర:** శూన్యాకాశం, **ఉత్తరం:** మెట్లు, **దక్షిణం:** FF-8. (విశాఖపట్నం జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, డాక్యుమెంట్ నెం: 4089/2023, తేదీ: 05-05-2023 ప్రకారం శ్రీమతి గేదెల లక్ష్మి పేరున కలదు).

**3.** ఋణగ్రహీత పేరు & చిరునామా : శ్రీమతి కొరుదు జ్యోతి, భర్త: కె. అప్పల రాజు.
చెల్లించవలసిన మొత్తం బకాయి : రూ. 3,81,692.00 (అక్షరాల మూడు లక్షల ఎనభై ఒక్క వేల ఆరు వందల తొంభై రెండు రూపాయలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 13.11.2025 — స్వాధీనత నోటీసు తేది : 18.02.2026
స్థిరాస్తి వివరములు : షెడ్యూల్-బి : విశాఖపట్నం అర్బన్, టీఆర్ ముత్యమాంబ కాలనీ, కంచరపాలెం గ్రామం, సర్వేనెం. 41/4 లో మొత్తం బ్లాక్ ఏరియా 912 చ॥గ॥లోని భూమి అవిభాజ్యపు వాటా భూమి 19 చ॥గ॥లుతో బ్లాక్ నెం.B-1 లోని ఒక ఫ్లాట్ 365 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని అనుపాత వాటాతో కలిపి) మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.FF-7 కలదు, సమీప డోర్ నెం. 35-36-1. బ్లాక్ హద్దులు (బ్లాక్ నెం.B-1) : **తూర్పు:** బ్లాక్ నెం: B-2, **పడమర:** బ్లాక్ నెం: C-1, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఎపి టిడ్కో. రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం: FF-7. హద్దులు: **తూర్పు:** వరండా, **పడమర:** శూన్యాకాశం, **ఉత్తరం:** FF-8, **దక్షిణం:** శూన్యాకాశం. (విశాఖపట్నం జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, డాక్యుమెంట్ నెం: 5322/2023, తేదీ: 09-06-2023 ప్రకారం శ్రీమతి కొరుదు జ్యోతి పేరున కలదు).

**4.** ఋణగ్రహీత పేరు & చిరునామా : శ్రీమతి నవదన ఈశ్వరమ్మ, భర్త: ఆదినారాయణ.
చెల్లించవలసిన మొత్తం బకాయి : రూ. 3,86,203.00 (అక్షరాల మూడు లక్షల ఎనభై ఆరు వేల రెండు వందల మూడు రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 13.11.2025 — స్వాధీనత నోటీసు తేది : 18.02.2026
స్థిరాస్తి వివరములు : షెడ్యూల్-బి : విశాఖపట్నం అర్బన్, టీఆర్ ముత్యమాంబ కాలనీ, కంచరపాలెం గ్రామం, సర్వేనెం. 41/4 లో మొత్తం బ్లాక్ ఏరియా 912 చ॥గ॥లోని భూమి అవిభాజ్యపు వాటా భూమి 19 చ॥గ॥లుతో బ్లాక్ నెం.B-2 లోని ఒక ఫ్లాట్ 365 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని అనుపాత వాటాతో కలిపి) గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం.GF-2 కలదు, సమీప డోర్ నెం. 35-36-1. బ్లాక్ హద్దులు (బ్లాక్ నెం.B-2) : **తూర్పు:** బ్లాక్ నెం: A-1, **పడమర:** బ్లాక్ నెం: B-1, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఎపి టిడ్కో. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం: GF-02 హద్దులు: **తూర్పు:** బ్లాక్ నెం: A-1, **పడమర:** వరండా, **ఉత్తరం:** GF-1, **దక్షిణం:** GF-3. (విశాఖపట్నం జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, డాక్యుమెంట్ నెం: 4090/2023, తేదీ: 05-05-2023 ప్రకారం శ్రీమతి నవదన ఈశ్వరమ్మ పేరున కలదు).

**5.** ఋణగ్రహీత పేరు & చిరునామా : శ్రీమతి శ్రీకా దుర్గ, భర్త: రాము.
చెల్లించవలసిన మొత్తం బకాయి : రూ. 3,82,825.00 (అక్షరాల మూడు లక్షల ఎనభై రెండు వేల ఎనిమిది వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 13.11.2025 — స్వాధీనత నోటీసు తేది : 18.02.2026
స్థిరాస్తి వివరములు : షెడ్యూల్-బి : విశాఖపట్నం అర్బన్, టీఆర్ ముత్యమాంబ కాలనీ, కంచరపాలెం గ్రామం, సర్వేనెం. 41/4 లో మొత్తం బ్లాక్ ఏరియా ఎ. 912 చ॥గ॥లోని భూమి అవిభాజ్యపు వాటా భూమి 19 చ॥గ॥లుతో బ్లాక్ నెం.B-1 లోని ఒక ఫ్లాట్ 365 చ॥అ॥లుతో (కామన్ ఏరియాలోని అనుపాత వాటాతో కలిపి) రెండువ అంతస్తులోని ఫ్లాట్ నెం.SF-11 కలదు, సమీప డోర్ నెం. 35-36-1. బ్లాక్ హద్దులు (బ్లాక్ నెం.B-1) : **తూర్పు:** బ్లాక్ నెం: B-2, **పడమర:** బ్లాక్ నెం: C-1, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఎపి టిడ్కో. రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం: SF-11. హద్దులు: **తూర్పు:** వరండా, **పడమర:** శూన్యాకాశం, **ఉత్తరం:** SF-12, **దక్షిణం:** SF-10. (విశాఖపట్నం జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, డాక్యుమెంట్ నెం: 4662/2023, తేదీ: 23-05-2023 ప్రకారం శ్రీమతి శ్రీకా దుర్గ పేరున కలదు).

తేదీ: 18.02.2026, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# ఆన్‌లైన్ జూదం మోజు...!

**మహిళ హత్యతో ముగిసిన పథకం -వీడిన ఆరిలోవ మహిళ హత్య కేసు మిస్టరీ -టవర్ డంప్, సీసీటీవీతో మిస్టరీ ఛేదన -ఇంట్లో ఒంటరిగా ఉన్న గృహిణిపై దాడి... రూ.8.62 లక్షల విలువైన బంగారం, నగదు దోపిడీ -స్నేహితుడి వేషంలో హంతకుడు... హత్య రహస్యానికి తెరలేపిన దర్యాప్తు -మహిళను హతమార్చిన నిందితుడు అరెస్ట్ -మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన క్రైమ్ డిసిపి లతా మాధురి**

(విశాఖ క్రైమ్/ఆరిలోవ - ప్రభాతవార్త)



విశాఖ నగరంలోని ఆరిలోవలో సంచలన హత్య కేసును పోలీసులు త్వరితగతిన ఛేదించారు. ఆన్‌లైన్ జూదంలో కోటి రూపాయలకుపైగా నష్టపోయి, అప్పుల్లో కూరుకుపోయిన వ్యక్తి అప్పులు తీర్చుకోవడా నికి గృహిణిని హతమార్చి బంగారం, నగదు దోచుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. సోమవారం ఆరిలోవ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి లతా మాధురి, క్రైమ్ ఏసిపి (ఇంచార్జ్), ద్వారకా ఏసిపి అన్నెపు నరసింహమూర్తి వివరాలను తెలియజేశారు..

## ఘటన వివరాలు

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గా నగర్‌లో ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల మధ్య ఈ హత్య ఘటన వెలుగు చూసింది. దుర్గానగర్‌కు చెందిన కాపు వెంకట రమణ (60) ప్రతిరోజులాగే విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం తెరిచి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో తన భార్య కాపు లక్ష్మీ మృతదేహం కనిపించింది. ముక్కు, నోటి వెంట రక్తస్రావంతో ఆమె ప్రాణాలు కోల్పోయినట్టు గుర్తించారు. ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆరిలోవ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## నిందితుడు ఎవరు?

దర్యాప్తులో బొబ్బిలికి చెందిన వంజరాపు శివ గంగరాజు అలియాస్ టాటూ శివ (34)ను నిందితుడిగా గుర్తించారు. ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడి సుమారు కోటి రూపాయలు నష్టపోయినట్లు, దాదాపు రూ.25 లక్షల అప్పుల్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలితో ఫోన్ ద్వారా పరిచయం పెంచుకుని, ఆమె ఆర్థిక స్థోమత గురించి తెలుసుకుని ముందస్తుగా హత్యకు పథకం పన్నినట్లు వెల్లడైంది.

## ఎలా జరిగింది?

11వ తేదీ ఉదయం అరిలోవకు చేరుకున్న నిందితుడు గుర్తుతెలియని ఫోన్ ద్వారా బాధితురాలికి కాల్ చేసి ఇంటికి వెళ్లాడు. స్నేహితుడిగా నటించి డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఒక్కసారిగా దాడి చేసి గొంతు నులిమి హతమార్చాడు. తర్వాత ఆమె ఒంటిపై ఉన్న బంగారు పుస్తులతాడు, నల్లపూసల దండ, ఉంగరాలు, గాజులు తీసుకుని, కప్‌బోర్డ్‌లోని నగదు కూడా దోచుకుని పరారయ్యాడు.

## సాంకేతిక ఆధారాలతో నేరస్తుడిని పట్టుకున్న వైనం

సీపీ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షణలో, డీసీపీ (క్రైమ్స్) కె.లతా మాధురి, ఏసీపీ ద్వారకా డివిజన్ ఇన్‌ఛార్జ్ ఏ.నరసింహమూర్తి ఆధ్వర్యంలో సీఐ వి.చక్రధరరావు నేతృత్వంలోని బృందం టవర్ డంప్, కాల్ డేటా రికార్డులు (సిడిఆర్), సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడు ధనబాద్, కాశీ, ఢిల్లీ, రాయగడ ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా తమిళనాడుకు వెళ్లే ప్రయత్నంలో ఈ నెల 22వ తేదీ రాత్రి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

## రికవరీ వివరాలు

పోలీసులు నిందితుడి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. నేరానికి ఉపయోగించిన రియల్‌మీ మొబైల్ ఫోన్, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

## అధికారుల అభినందనలు

కేసును వేగంగా ఛేదించిన అరిలోవ, ఎంవీపీ, ద్వారకా పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో పాటుగా ఉన్నతాధికారులు అభినందించారు. ఆరిలోవలో జరిగిన ఈ దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మహిళల భద్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# మహిళల భద్రతే లక్ష్యం

**పారదర్శకతతో సేవలందిస్తాం -విశాఖ మహిళ పోలీస్ స్టేషన్ ఏసీపీ సిహెచ్ అంబేద్కర్**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ మహిళా పోలీసు స్టేషన్ ఏసీపీగా సిహెచ్ అంబేద్క ర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎండాడ వద్ద గల మహిళా పోలీస్ స్టేషన్ ఏసిపి కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మహిళా పోలీసు స్టేషన్‌ను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లి, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతను పాటిస్తామని పేర్కొన్నారు. మహిళలు నిర్భయంగా ఫిర్యాదులు నమోదు చేసుకునే వాతావరణం కల్పించడమే లక్ష్యమని, సిబ్బందితో సమన్వయం చేసుకుని సమర్థవంతంగా పనిచేస్తామని ఏసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన బందోబస్తు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ సందర్భంగా పెందుర్తి సర్కిల్ పరిధిలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ తెలిపారు. ఆయన పర్యవేక్షణలో డి.ఆర్. కాలేజీ, చైతన్య కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఎస్‌వీఎల్ఎన్ కాలేజీ, శ్రీ నవోదయ కాలేజీ, బాలాజీ జూనియర్ కాలేజీ, అమృత జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాలలో పోలీసు సిబ్బందిని విధులు నిర్వహించేందుకు నియమించారు. ఉదయం ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించే ముందు విధుల్లో పాల్గొన్న సిబ్బందికి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించారు. ప్రశ్నాపత్రాల రవాణా సమయంలో, వాటిని ఇన్విజిలేటర్లకు అప్పగించే వేళ తీసుకోవాల్సిన భద్రతా చర్యలను వివరించారు. ఎటువంటి అలసత్వం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం అన్ని పరీక్షా కేంద్రాలు, వాటి పరిసర ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని, తల్లిదండ్రులు మరియు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ఆనందపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ ఎస్సీ కోలనీ, పక్కృతివాని పాలెంలో సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేసారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు ఉపాధి హామీ పథకం కింద పక్కృతివానిపాలేనికి రూ.3 లక్షలు, ఎస్సీ కోలనీకి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు సర్పంచ్ బి ఆర్ బి నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలోని సమస్యలపై దృష్టి సారించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారనడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బంకు రాజు, ఉప సర్పంచ్ పిల్లా సూరిబాబు, వార్డు సభ్యులు అక్కరమాని ఆది నారాయణ పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సహకార సంఘాల ఉద్యోగుల నిరవధిక సమ్మె : సిఐటియు మద్దత

ఆనందపురం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) పిలుపు మేరకు ఈ నెల 16 నుంచి ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం కూడా నిరవదికంగా కొనసాగింది. ఆందోళనకు సిఐటియు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భం గా ప్యాక్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎస్. నారాయణరావు మాట్లాడుతూ జి.ఓ నెంబరు .36ను అమలు చేయడంతో పాటు 2019, 2024 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్ వేతన సవరణలు చేసి అప్పటివరకు మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేసి ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల పరిమితిని తొలగించాలని, సహకార సంఘాల ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, 2019 తర్వాత నియమితులైన సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, వారికి కూడా జి.ఓ నెం.36 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు కనీసం రూ.5 లక్షల ఆరోగ్య బీమా, ఉద్యోగి సర్వీస్‌లో మరణించిన పక్షంలో కుటుంబానికి రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. డ్యూటు పద్ధతిని రద్దు చేయాలని, షేరు ధనంపై కనీసం 6 శాతం డివిడెండ్ లేదా వడ్డీ చెల్లించాలని, సిబ్బంది బదిలీలను డి.ఎల్.ఎస్.ఎఫ్ ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆనందపురం వేములవలస పిఎసిఎస్ ఛైర్మన్లు రౌతు నాగరాజు పాండ్రంకి అప్పలరాజు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ కార్యదర్శి టి. సన్యాసిరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు కె. కోటేశ్వరరావు, ఈసీ సభ్యులు ఎం. అప్పారావు, టి. కుమారి, కోశాధికారి డి.ఎం. జయరావు, అవతారం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

(విశాఖపట్నం - ప్రభాతవార్త)



సమత కళాశాలలో 'బి.సి.ఎ. విభాగం ఆధ్వర్యంలో "ఫ్రెషర్స్ డే ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో సమత కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపిక దాస్ పాల్గొని విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడుతూ "ప్రస్తుత ఐటీ రంగంలో బీసీఏ విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.సారబంది విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, కొత్తగా చేరిన విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. విభాగాధిపతి టి.హరినాథ్, బి.సి.ఎ. కోర్సు ప్రాముఖ్యతను వివరించి ప్రోగ్రామింగ్, వెబ్ టెక్నాలజీస్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలలో నైపుణ్యం సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.. సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్‌కు స్వాగతం పలికి తమ అనుభవాలను పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, టాలెంట్ షో, గేమ్స్ ద్వారా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బి.శిల్ప, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆనందోత్సాహాలతో విజయవంతంగా ముగిసింది.

# ఉగాది నాటికి 'టిడ్కో' కల సాకారం

**నిజమైన లబ్ధిదారులకే ఇళ్ల కేటాయింపు :ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గంలోని టిడ్కో హౌసింగ్ లబ్ధిదారుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడనుంది. 2017లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపకల్పన చేసిన ఈ గృహ సముదాయాలను, వచ్చే ఉగాది నాటికి అర్హులైన లబ్ధిదారులకు అందజేయనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని పనులను వేగవంతం చేస్తున్నారు. గతంలో బానోజీ తోట, పెద్ద గంట్యాడ (65వ వార్డు), దువ్వాడ మంగళ పాలెం, బర్మా కాలనీ (76వ వార్డు) ప్రాంతాల్లో హౌసింగ్ నిమిత్తం డీడీలు కట్టిన నిజమైన లబ్ధిదారులకే ఈ ఇళ్లను కేటాయిస్తారు. ఇప్పటికే బర్మా క్యాంప్ ప్రాజెక్టులో ఇళ్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరితగతిన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే బాధ్యతను పల్లా శ్రీనివాసరావు భుజానికెత్తుకున్నారు.

## దళారుల ఉచ్చులో పడవద్దు...

65వ వార్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వంతో గానీ, కూటమి నాయకులతో గానీ సంబంధం లేని వ్యక్తులు కొందరు మీటింగులు ఏర్పాటు చేస్తూ లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దని 66వ వార్డు టీడీపీ అధ్యక్షులు గోమాడ వాసు హెచ్చరించారు. "టిడ్కో ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ పర్యవేక్షణలో జరుగుతోంది. దళారుల మాటలు నమ్మి ఆందోళన చెందవద్దు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా ఎమ్మెల్యేని లేదా స్థానిక కూటమి నాయకులను సంప్రదించాలి" అని ఆయన స్పష్టం చేశారు. 2019 తర్వాత నిబంధనలకు విరుద్ధంగా టిడ్కో ఇళ్లను కొనుగోలు చేసినా, విక్రయించినా అవి చెల్లుబాటు కావని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎవరైనా అక్రమంగా డబ్బులు చెల్లించి ఉంటే, వారు తమ సొమ్మును సదరు వ్యక్తుల నుంచే వసూలు చేసుకోవాలని, ప్రభుత్వం కేవలం 2017లో డీడీలు కట్టిన అసలైన లబ్ధిదారులనే గుర్తిస్తుందని వాసు వివరించారు.

# భక్తి శ్రద్ధలతో అనంతపద్మనాభస్వామి పెళ్లిరాట మహోత్సవం

పద్మనాభం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



పద్మనాభం గ్రామంలో వేంచేసియున్న అనంత పద్మనాభస్వామి పెళ్లిరాట మహోత్సవంను సోమ వారం ఉదయం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాంజనేయస్వామి ఆచార్యులు, పవన కుమార్‌లు కుంతీమాధవస్వామి ఆలయ గాలి గోపురం ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం పూజలు చేసారు. అప్పటికే పసుపుకుంకుమలతో సిద్ధం చేసిన పెళ్లిరాటను వేదమంత్రాలు, సన్నాయి మేళాలలతో వేసారు. అలాగే మహిళలు పసుపు దంచారు. ఈ రోజు నుండి అనంతుని పెళ్లిపనులు జరగుతాయని అర్చకులు తెలిపారు. ఈ నెల 26 నుండి మార్చి 4 వరకు అనంతుని కళ్యాణ ఉత్సవాలు జరగనున్నాయి. ఎంపీపీ రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు రమణ, ఎంపిటీసీ కె.లక్ష్మి, నాయకులు ఎర్రినాయుడు, నాగు, నారాయణరావు, సన్నిబాబు, సన్యాసిరావు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ'

**-గాజువాక జోన్ నుంచి తరలిన పారిశుద్ధ్య కార్మికులు**

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం విజయవాడలో నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి గాజువాక జోన్ నుంచి పారిశుద్ధ్య కార్మికులు భారీగా తరలివెళ్లారు. 12వ పీఆర్సీ వేతనం అమలు, కాంట్రాక్టు కార్మికుల క్రమ బద్ధీకరణ, కడపలో తొలగించిన కార్మికుల పునరుద్ధరణ వంటి డిమాండ్ల సాధనకై ఈ పోరాటం చేపడుతున్నట్లు నేతలు పేర్కొన్నారు. 12వ పీఆర్సీ కమిటీ ప్రకారం వేతనాల చెల్లింపు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల పర్మినెంట్. రిటైర్మెంట్, మరణించిన కార్మికుల బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు గత సమ్మె ఒప్పందాల తక్షణ అమలు. సంఘం నాయకులు గొలగాని అప్పారావు, నక్క నాగరాజు, ఎస్. గణేష్, మీనాక్షి, అరుణ, నూకరత్నం, రాము, విజయ్ పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనుల కోసం వినతిపత్రం

మాధవధార,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



ఉత్తర నియోజకవర్గం 49వ వార్డు కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ వైభవ్ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణు కుమార్ రాజు దేవాదాయ శాఖ ఆనం రామ నారాయణ రెడ్డిని, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ రామ చంద్రమోహన్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ ప్రాంగణం పక్కన ఉన్న సింహాచలం దేవాలయ స్థలంలో కోనేరు నిర్మాణం, కళ్యాణ మండపం ఏర్పాటు, ఇతర దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక భక్తుల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోనేరు నిర్మాణం అవసరం అని తెలిపారు. కోనేరు ఏర్పాటుతో భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా పుణ్యస్నానాల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. అలాగే కళ్యాణ మండపం నిర్మాణం ద్వారా వివాహాలు, వ్రతాలు, ఇతర ధార్మిక కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. భక్తుల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేర్చేందుకు సింహాచలం నుండి అవసరమైన స్థలాన్ని కేటాయించి అభివృద్ధి పనులకు ప్రభుత్వం తరపున చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి, కమిషనర్, ప్రభుత్వ పరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ఆటోలో మరిచిపోయిన గోల్డ్ సూట్‌కేస్

**గంటల్లోనే తిరిగి అప్పగించిన ద్వారక క్రైమ్ పోలీసులు -నిబద్ధతకు నిదర్శనం -ద్వారక పోలీసుల సేవ**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



ఆటోలో అనుకోకుండా మరిచిపోయిన బంగారు ఆభరణాలు కలిగిన సూట్‌కేస్‌ను ద్వారక క్రైమ్ సబ్‌డివిజన్ పోలీసులు వేగ వంతమైన చర్యలతో గుర్తించి యజమానికి తిరిగి అప్పగించారు. రాజాం ప్రాంతానికి చెందిన పెరుమళ్ల ప్రసాద్ (36), తండ్రి సూరప్పుడు, విశాఖపట్నం వరకు ప్రయాణించి, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. అనంతరం ఒక ఆటోరిక్షాలో ద్వారక బస్ స్టాప్‌కు వెళ్లి అక్కడ దిగారు. అయితే, దిగేటప్పుడు తన సూట్‌కేస్‌ను ఆటోలోనే మరిచిపోయారు. ఆ సూట్‌కేస్‌లో సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలు, బట్టలు, ఇతర వ్యక్తిగత వస్తువులు ఉన్నాయి. విషయం గుర్తించిన వెంటనే ప్రసాద్ ద్వారక క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఉమెన్ ఏఎస్ఐ 2712, పి.సి 3076 ఎన్.రాజు స్పందించి, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. ఆ దృశ్యాల ఆధారంగా సంబంధిత ఆటో నంబర్‌ను గుర్తించి డ్రైవర్‌ను సంప్రదించారు. ఆటో డ్రైవర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సూట్‌కేస్‌ను అప్పగించారు. పోలీసుల సమక్షంలో పరిశీలించగా, అందులోని ఆరు తులాల బంగారు ఆభరణాలు సహా ఇతర వస్తువులు అన్నీ యథాతథంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఆస్తిని యజమానికి అప్పగించారు. పోలీసుల వేగవంతమైన స్పందన, నిబద్ధతపై ఫిర్యాదుదారు కృతజ్ఞతలు తెలిపారు.

# షఫీ ఉల్లా ఖాన్‌కు రూ.1.35 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మైనారిటీ వర్గానికి చెందిన షేక్ షఫీ ఉల్లా ఖాన్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,35,000 మంజూరయ్యాయి. ఈ చెక్కును నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు కలిసి బాధితుడికి సోమవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సాయం అందించడం పట్ల గాజువాక మైనారిటీ సెల్ అధ్యక్షులు రెహమాన్ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# ఆలయ పునర్నిర్మాణం పేరిట అక్రమ వసూళ్లు

**కలెక్టర్‌కు హరేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు**

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



ఆలయాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొండయ్యవలస గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. శ్రీ మరిడిమాంబ, బంగారమ్మ ఆలయ అభివృద్ధి కమిటీకి సమాచారం లేకుండా కొందరు వ్యక్తులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, పునర్నిర్మాణం పేరిట ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని కలెక్టర్ హరేంద్రప్రసాద్ కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ ఆచారాలకు విరుద్ధంగా శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతున్నారని, ఇది భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేనని కమిటీ అధ్యక్షులు బలిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి బుదిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న బ్రోకర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరిసా రామచంద్రరావు, సన్యాసిరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అయినాడ, రేవిడి మధ్య తారురోడ్డు నిర్మాణానికి మూడు కోట్ల 65 లక్షల విడుదల

పద్మనాభం,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



మండలంలో అయినాడ, రేవిడి గ్రామాల మధ్య తారురోడ్డు నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు విడుదలైనట్లు ఆర్ అండ్ బిడిఈఈ గంగరాజు చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి త్వరలో అయినాడ వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంఖుస్థాపన చేయనున్నారని ఆయన అన్నారు. గత ప్రభుత్వం హయామాలో ఇదే రోడ్డు నిర్మాణానికి అప్పటి మంత్రి అవంతి శ్రీనివాసరావు రేవిడి గ్రామం వద్ద పదహారు కోట్ల రూపాయలతో శంఖుస్థాపన చేసి కనీసం కిలోమీటరు దూరమైన తారురోడ్డును నిర్మించలేకపోయారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు కోరిన మేరకు గంటా శ్రీనివాసరావు ప్రస్తుతం గోతులతో నిండిన రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయడానికి చొరవ చూపారు.

# మహిళలకు కస్తూరిబా ఆదర్శప్రాయురాలు

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



దేశభక్తి, శాంతి, సహనాల్లో కస్తూరిబా గాంధీ మహిళలకు మార్గదర్శి అని బా-బాపు భవన్ అధ్యక్షురాలు పి.అంతర్వేది అన్నారు. సోమవారం ద్వారకానగర్‌లో నిర్వహించిన కస్తూరిబా వర్ధంతి సభలో ఆమె మాట్లాడారు. గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ దేశం కోసం ఆమె చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ముఖ్య అతిథి, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలని కస్తూరిబా నిరంతరం ప్రబోధించేవారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కస్తూరిబా వర్ధంతిని 'మాతృ దినోత్సవం'గా నిర్వహిస్తూ, పేద విద్యార్థుల తల్లులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వై.రమణి, జయశ్రీ, చల్లా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చందనోత్సవం క్యూ లైన్ల నిర్వహణపై ఈఓ, పోలీసు అధికారుల పర్యవేక్షణ

సింహాచలం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త



శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి చంద నోత్సవం పురస్కరించుకుని, భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్య నిర్వహణ అధికారి జె.వెంకట్రావు వారి ఆధ్వర్యంలో, క్యూలైన్ల నిర్వహణపై దేవస్థానం అధికారులు, పోలీస్ విభాగం ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపాలపట్నం పోలీస్ సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ రామారావు వారి బృందంతో కలిసి దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు పలు ఏరియాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా క్యూ లైన్ల నిర్వహణ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణలో భాగంగా సోమవారం సాయంకాలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.వెంకటరావు, సహాయ కార్య నిర్వహణాధికారి రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామరాజులతో కలిసి అధికారులు ఉమ్మడిగా క్యూ మార్గాలను పర్యవేక్షణ చేశారు. భక్తుల భద్రత మరియు క్రమశిక్షణతో కూడిన దర్శనం కోసం పోలీసు శాఖ, దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ చందనోత్సవ వేడుకకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సౌకర్యంతంగా చేస్తున్నట్లు వెల్లడించారు.

# రజక సామాజిక వర్గానికి అన్నివిధాలుగా అండగా ఉంటా..

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



రజక సామాజిక వర్గానికి అన్నివిధాలుగా అండగా ఉంటానని వారి అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు జీవీఎంసీ 69వ వార్డ్ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. వార్డ్ లోని తుంగ్లాం గ్రామంలో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో బల్లల పండుగ ఘనంగా జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్ర మానికి వార్డ్ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ రజకులు అన్ని రంగాలలో రాణించాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతి స్థితికి చేరుకొవాలని ఆకాంక్షించారు. పవన్ సాయి హాస్పిటల్స్ అధినేత టి.రామారావు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా విభాగం బలోపేతమే లక్ష్యం : మళ్ళ విజయ ప్రసాద్

గాజువాక,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



వైకాపా మహిళా విభాగం సంస్థాగతంగా బలోపేతం కావాలని విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ళ విజయ ప్రసాద్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మల్ల ధనలత ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి మహిళలకు నామినేటెడ్ పదవులు, సంక్షేమ పథకాల్లో పెద్దపీట వేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి మహిళా కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పెడాడ రమణ కుమారి, వినిత రెడ్డి, వరలక్ష్మి, రమణి యాదవ్ వివిధ వార్డుల మహిళా అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

## టిడ్కో లే అవుట్ల పురోగతిపై సమీక్ష

**ఉగాది నాటికి టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు అందించేందుకు సర్వం సిద్ధం చేయండి : టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ బి.సునీల్ కుమార్ రెడ్డి**

విశాఖపట్నం ఫిబ్రవరి 23,ప్రభాతవార్త



నగరంలో పేద, మధ్య తరగతి వారికి ప్రభుత్వం అందించే టిడ్కో గృహాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ఉగాది నాటికి అందించేందుకు చర్యలు చేపట్టాలని టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ బి.సునీల్ కుమార్ రెడ్డి జీవీఎంసీ, టిడ్కో అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో టిడ్కో గృహాల పురోగతిపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, అదనపు కమిషనర్ పి ఎమ్.సత్యవేణి ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ నగరంలో పేద మధ్యతరగతి వారికి ప్రభుత్వం అందించే టిడ్కో గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేసి ఉగాది నాటికి మేళా నిర్వహించి లబ్ధిదారులకు అందించేందుకు సర్వం సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. నగరంలో 36 లే అవుట్ లలో ఇప్పటికే 16 లేఔట్‌లలో 7344 టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయడమైనదని, మిగిలిన పలు లేఔట్లలో టిడ్కో గృహాలు ఉగాది నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు సర్వం సిద్ధం చేయలన్నారు.




## సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం...

**ఎలమంచిలి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మండలంలోని ములకలాపల్లి గ్రామంలో పల్లె పండుగ 2.0లో భాగంగా సుమారు 6 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పనలో భాగంగా రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఇందులో భాగంగా మండలంలోని ములకలాపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు మహా సిమెంట్ కర్మాగారం స్కాలర్షిప్లకు ఎంపిక..

**ఎలమంచిలి ,ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మహా సిమెంట్ కర్మాగారం యాజమాన్యం నిర్వహించిన మెరిట్స్ స్కాలర్షిప్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల తరపున ఎంపికైన విద్యార్థులు బొట్టా జ్యోతిష్ కుమార్, చల్లా లహరి, నానేపల్లి దుర్గాలకు ఎనిమిది వేలు, ఆరువేల, నాలుగు వేల రూపాయలు, చెక్కు, సర్టిఫికెట్లు మహా సిమెంట్ యాజమాన్యం ఇవ్వడం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ ఎన్ ఎల్ డి భవాని, ఉపాధ్యాయ సిబ్బంది తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.




## న్యాయవాదులు విధులు బహిష్కరణ...

**ఎలమంచిలి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పట్టణంలోని న్యాయవాదులు సోమవారం తమ విధులకు బహిష్కరించి, ర్యాలీ నిర్వహించి పాత జాతీయ రహదారి బస్ స్టాండ్ సమీపంలో మానవహారం ఏర్పడి న్యాయవాదులకు రక్షణ కల్పించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ప్రెసిడెంట్ తల్లా సత్యనారాయణ మాట్లాడుతూ కర్నూలు న్యాయవాది పై అక్కడ సీఐ ప్రవర్తించిన తీరుపై నిరసనగా విధులు బహిష్కరించామని అన్నారు. అక్కడే అధికారిని వెంటనే సస్పెండ్ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఎల్వి



## నారా లోకేష్ పర్యటన విజయవంతం చేయాలి..

**- ప్రగడ నాగేశ్వరరావు..**

ఎలమంచిలి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త: నియోజకవర్గం అచ్యుతాపురంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన యువనాయకులు, యువ గళం రథసారథి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రాంబిల్లి మండలం లాలం కోడూరు పంచాయతీలో సీతాపాలెం గ్రామంలో ఏర్పాటు కాబోతున్న బ్లూజెట్ పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈనెల 28వ తేదీన విచ్చేయుచున్నారని ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ విజయవంతం చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తెలుగుదేశం పార్టీ జిల్లా అనుబంధ కమిటీలను ఈ వారం రోజుల్లో పూర్తిచేసి, ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ విధివిధానాలు వివరించాలని, పార్టీని మరింత బలంగా తయారు చేసేందుకు స్థానిక సంస్థల్లో గెలుపే ధ్యేయంగా పనిచేసేందుకు అధిష్టానం ఆదేశాలు ప్రకారం గ్రామాల్లో పర్యటన చేస్తామని, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పార్టీ ప్రతిష్టంగా చేసేందుకు ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల అధ్యక్షులు పీలా తులసీరామ్, లాలం భరత్, పెంటకోట విజయ్, గొర్లె శివన్నారాయణ మూర్తి, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, జిల్లా కమిటీ సభ్యులు, పిఎసిఎస్ చైర్మన్లు, ప్రధాన కార్యదర్శిలు పాల్గొన్నారు.



## సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)** దేశ రక్షణలో అసువులు బాసిన, విధి నిర్వ హణలో గాయపడిన మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్స వ నిధికి ప్రతి ఒక్కరూ ఉదారంగా విరాళాలు అందించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నర్సీ పట్నం, యలమంచిలి పురపాలక సంఘాల తరపున సాయుధ దళాల పతాక దినోత్స వానికి 2,42000/ రూపాయలు ఫ్లాగ్ ఫండ్ చెక్కుని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ లకు మెప్మా పి డి కె. సరోజినీ తో కలిసి స్వయం సహాయక సంఘాల సభ్యులు వర లక్ష్మి, మాధవి, కుమారి లు అందజేశారు.



## ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు..

**ఎలమంచిలి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కొక్కిరాపల్లి గురుకుల పాఠశాల వద్ద ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు హాజరయ్య విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్నారు. పరీక్షా కేంద్రాల ముఖద్వారం దగ్గర పట్టణ, రూరల్ పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి లోపల కనిపిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొదటి సంవత్సరం మొదటి సంవత్సరం పరీక్షలకు 427 మంది విద్యార్థులకుగాను 407 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరిడెంట్ బి భాగ్య వతి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ సిహెచ్ కృష్ణంరాజు తెలిపారు. గురుకుల పాఠశాలలో 488 మంది విద్యార్థులకుగాను 477మంది పరీక్షలకు హాజరైనట్లు సిఎస్టి హరిప్రసాద్, డివోసత్యనారాయణ తెలిపారు.

## ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభం

**ఎస్ రాయవరం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** మండలంలో అడ్డరోడ్డు శ్రీ ప్రజ్ఞ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు సోమ వారం ప్రారంభమయ్యాయి. కళాశాలవద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు హాజరయ్య విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మొదటి సంవత్సరం పరీక్ష లకు 502 మంది విద్యార్థులకుగాను 487 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరిడెంట్ సింహాచలం తెలిపారు.

# అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు

**- జిల్లా కలెక్టరు విజయ కిష్ణన్**

**అనకాపల్లి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త):** భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని. పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ లకు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం1 , 2 లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ లు జిల్లాలో వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గూర్చి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా డివిజను, మండల, గ్రామ స్థాయి లలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరయి ఆయా స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన పి.జి.అర్.ఎస్ లో 175, రెవిన్యూ క్లినిక్ లో 256 అర్జీలు మొత్తం 431 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి, బి జె ఆర్ ఎస్, ఎన్ ఎ ఓ బి, ఎ పి ఐ ఐ సి, ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎస్ సుబ్బలక్ష్మి, మనోరమ, రామ మాణి, అనిత, సిపిఓ జి. రామారావు, డ్వామా, మెప్మా, ఐ సి డి ఎస్, గృహ నిర్మాణ పథక సంచాలకులు శిస్టు రవీంద్ర, కె సరోజినీ, సూర్య లక్ష్మి, శ్రీనివాస్, జిల్లా ఎక్సయిజ్ అధికారి వి.సుదీర్, జిల్లా సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజా తదితరులు పాల్గొన్నారు.



## భూములు కాజేసేందుకు పెద్దలు కుట్ర

**- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దళిత రైతులు**

**మాకవరపాలెం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

దళిత రైతుల జిరాయితి భూమిని కాజేసేందుకు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై పెద్దలు కుట్ర పందుతున్నారని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాకవరపాలెం మండలం రాచపల్లి రెవిన్యూ పరిధి యరకన్నపాలెం దళిత రైతులు ఫిర్యాదు చేశారు. దీని సంబంధించి వివరాలు మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ పరిధిలోని ఎరకన్నపాలెం గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 5661/2లో ముగ్గురు దళిత రైతులకు ఒక్కొక్కరికి 95 సెంట్లు చొప్పున చెందిన 285 సెంట్లు జిరాయితి భూమి ఉంది. రావాడ సన్యాసిరావు, రావాడ గోవిందరావు, గుడాల అప్పారావు ముగ్గురు రైతుల పేర 2016లోనే పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. కాగా ఇదే భూములపై తామరం పిఎసిఎస్ లో ముగ్గురు రైతులు వ్యవసాయ రుణాలు పొందారు. వీరిలో రావాడ సన్యాసిరావు, వ్యవసాయ రుణాలు రెవిన్యూవల్ చేసేందుకు బ్యాంకు వెళ్లారు. ఆన్లైన్లో మీ భూమి వేరొకరి పేర్ని ఉందంటూ బ్యాంకు సిబ్బంది తెలియజేయడంతో అవాక్కైనా దళిత రైతులు మాకవరపాలెం తాసిల్దారును సంప్రదించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన అధికారులు అదే భూమిని తిరిగి దళిత రైతుల పేర ఆన్లైన్ నమోదు చేసారు. అంతటితో ఆగకుండా గతంలో ఆభూములు కాజేయాలనుకున్న వ్యక్తులు నర్సీపట్నం ఆర్డీవో కోర్టులో కేసు నమోదు చేసి రైతులకు నోటీసులు ఇప్పించారు. దీనిపై ఫిబ్రవరి 21వ తేదీ శనివారం ఆర్డిఓ కోర్టులో విచారణ చేయగా మీ భూములు సర్వే చేసి న్యాయం చేస్తామని నర్సీపట్నం ఆర్డిఓ తెలిపినట్లు రైతులు తెలిపారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ పరిధి ఎరకన్నపాలెంలో పరిశ్రమల ఏర్పాటుకు సర్వే నంబర్ 737లో ప్రభుత్వం భూములు సేకరిస్తున్న విషయం తెలిసిందే. పరిశ్రమలకు సహకరిస్తున్న భూములను అనుకొని తమ జిరాయితీ భూములు ఉండడంతో పెద్దల కన్ను పడిందని, ఆభూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్న పెద్దల నుంచి బెదిరింపులు వస్తున్నాయని మాకు రక్షణ కల్పించాలంటూ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. దళిత రైతులమైన మాభూములను రికార్డులో తారుమారు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని, మాభూములు ఆక్రమించాలనుకున్న దగ్గర నుంచి రక్షణ కల్పించాలని పి జి ఆర్ ఎస్ లో కలెక్టర్ కు రైతులు ఫిర్యాదు చేశారు.




## జిల్లా కోర్టును సందర్శించిన షిరిడి సాయి లా కళాశాల విద్యార్థులు

**- విభిన్న న్యాయచట్టాల పట్ల పెంపొందించుకున్న అవగాహన**

**అనకాపల్లి ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)**

స్థానిక జిల్లా కోర్టును అనకాపల్లి షిరిడి సాయి న్యాయ కళాశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. జిల్లా జడ్జి నరేష్ అనుమతిం చడంతో జిల్లా కోర్టు పరిధిలోని వివిధ కోర్టులను సందర్శించి విభిన్న కేసుల్లో ఇరు వర్గాల న్యాయవాదుల వాదోపవాదములను ఆసక్తిగా తిలకించి అవగాహన పెంపొందించు కున్నారు. సివిల్ కోర్టు, కుటుంబ కోర్టు, క్రిమినల్ కేసులు, బెయిల్ బుల్ ,నాన్ బెయిలబుల్ కేసులు నమోదుకు సంబంధించి న వివిధ సెక్షన్ ల పట్ల న్యాయ విద్యార్థుల అవగాహనను జిల్లా జడ్జి నరేష్ తెలుసుకున్నారు. జిల్లా జడ్జి, న్యాయ విద్యార్థుల మధ్య సంభాషణ ఉత్తేజ బరితంగా చాలా ఉల్లాసం గా సాగింది. జిల్లా కోర్టు సందర్శన విభిన్న చట్టాలపైన, న్యాయ శాస్త్రం పట్ల మరింత అవగాహన పొందేందుకు దోహదం కలిగించిందని కోర్టును సందర్శించి నవిద్యార్థుల్లో సర్వత్రా ఆనందం వ్యక్తం అయింది. షిరిడి సాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు, కళాశాల ప్రిన్సిపల్ బి శంకర్రావు , ఈ అవకాశం కల్పించిన జిల్లా జడ్జి నరేష్ తదితరు ప్రముఖులకు కళాశాల విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభం

**ఎలమంచిలి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కొకరాపల్లి గురుకుల పాఠశాల వద్ద ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు హాజరయ్య విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్నారు. పరీక్షా కేంద్రాల ముఖద్వారం దగ్గర పట్టణ, రూరల్ పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి లోపల కనిపిస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొదటి సంవత్సరం మొదటి సంవత్సరం పరీక్షలకు 427 మంది విద్యార్థులకు గాను 407 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరిడెంట్ బి భాగ్యవతి, డిపార్ట్మెంట్ ఆఫీసర్ సిహెచ్ కృష్ణంరాజు తెలిపారు. కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో 488 మంది విద్యార్థులకు గాను 477 మంది పరీక్షలకు హాజరైనట్లు సి ఎస్ టి హరిప్రసాద్, డివో సత్యనారాయణ తెలిపారు.



## నూరు శాతం అక్షరాస్యత రూపొందాలి: కలెక్టర్ విజయకృష్ణన్

**అనకాపల్లి, ఫిబ్రవరి 23 (ప్రభాత వార్త):** అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా అనకాపల్లి జిల్లాను నూరుశాతం అక్షరాస్యత జిల్లాగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అక్షర ఆంధ్ర కార్యక్రమంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో మొదటి విడత అక్షర ఆంధ్ర అక్షరాస్యత కార్యక్రమంలో బాగంగా 93,056 మంది నిరక్షరాస్యుల ను నమోదుచేశామన్నారు వీరికి 9,351మంది వాలంటరీ టీచర్స్ సహకారంతో ప్రతి రోజు తరగతులు నిర్వహిస్తూ, చదవడం, రాయడం, లెక్కలు, డిజిటల్, ఫైనాన్సియల్ అక్షరాస్యతలో బోధన జరుగుతుందన్నారు. ఆన్ లైన్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నామన్నారు. ఈ నెల 28 వ తేదీన పునాది బాషా సంఖ్య పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్ఏటి) పై ఫ్రీ ఫైనల్ అంచనా పరీక్ష నిర్వహిస్తా మన్నారు. జిల్లాలో అన్ని మండల, మునిసిపాలిటీ, పరిధిలో గ్రామ, వార్డ్ సచివాలయాలు, గ్రామాల పరిధిలో నమోదైన నిరక్షరాస్యులకు పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, పంచాయితీ కార్యాలయాలలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు, సాధన పత్రాల పుస్తకం లో గల 5 వ మోడల్ పేపర్ లో పరీక్ష నిర్వహించి ప్రతి వాలంటీర్ టీచర్ ఫలితాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని అందుకు అన్ని మండలాల ఎంపిడిఓలు, ఏపీవోలు, ఏపీయంలు, మున్సిపల్ కమీషనర్లు, సిఎంఎం, ఏపిడి యుసిడిలను సమన్వయం చేసుకొని పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా వయోజన విద్యా శాఖ సహాయ సంచాలకులు డి. చిన్ని కృష్ణ ను ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ పి డి శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో శివ నారాయణ మూర్తి, డి ఆర్డి ఎ డ్వామా పీడీ లు శచి దేవి, పూర్ణిమ దేవి, డిపిఓ సందీప్ జిల్లా, జి ఎస్ డబ్ల్యూ ఎస్ సమన్వయ అధికారి మంజుల వాణి, వివిధ శాఖల అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.



## బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయంలో అన్న సమారాధన

**ఎస్ రాయవరం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

మండలంలో పెద ఉప్పలం గ్రామంలో వేంచేసి యున్న బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్న సమాధానం కార్యక్రమం నిర్వహించారు. చిన దొడ్డి గల్లు గ్రామానికి చెందిన వెలగా బాబ్జి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో నిర్వహించామని ఆలయ అర్చకులు నాగపార్వతీశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని. అలాగే అన్న సమాధాన కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కందికొండ శ్రీనివాసరావు.ఎస్ రమణ.పి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు పటిష్ట పోలీస్ బందోబస్తు : ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, ఫిబ్రవరి 23 :(ప్రభాతవార్త)** ఫిబ్రవరి 23 నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసేలా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ పరీక్షల నిర్వహణపై జిల్లాలోని పోలీస్ అధికారులకు ఎస్.హెచ్.ఓ లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని 34 థియరీ పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద మహిళా అభ్యర్థుల తనిఖీ కోసం కచ్చితంగా ఒక మహిళా పోలీస్ కానిస్టేబుల్‌ను నియమించడమైనది. పరీక్షా కేంద్రాల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత మండల మెజిస్ట్రేట్ల ద్వారా 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లోని జెరాక్స్ సెంటర్లను పరీక్షా సమయంలో మూసివేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బందిని మోహరించారు. ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు ముగిసిన తర్వాత పేపర్లను భద్రంగా స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చే ప్రక్రియలో ఎస్కార్ట్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. సుమారు 26,644 మంది విద్యార్థులు హాజరవుతున్న ఈ పరీక్షల నిర్వహణలో ఏ విధమైన నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన ఆకాంక్షించారు.

## బస్సు డ్రైవింగ్‌లో మహిళలు ముందంజలో ఉండాలి

**- జిల్లా రవాణా శాఖ అధికారిని ప్రవీణ**

**అనకాపల్లి ఫిబ్రవరి 23: (ప్రభాతవార్త)** ఆర్టీసీ సంస్థలు బస్సు డ్రైవర్లుగా మహిళలు మగవారితో సమానంగా విధులు నిర్వహించడానికి ముందుకు రావడం అభినందనీయమని అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారిని వి ప్రవీణ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టిసి డిపో డ్రైవింగ్ స్కూల్ లో 12వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ డ్రైవింగ్ శిక్షణ ద్వారా రాబోయే రోజుల్లో డ్రైవింగ్ నందు మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చని, అత్యుత్తమ ఆధునిక సాంకేతికత తో కూడిన డ్రైవర్ల కొరతను అధిక మించడానికి ఆర్టీసీ లో డ్రైవింగ్ స్కూల్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించుకుని మరింత మంది కి ఉపాధి పొందేటట్లు డ్రైవింగ్ నందు అత్యుత్తమ నైపుణ్యాలు నేర్పడం జరుగుతుంది అని తెలిపారు. రానున్న రోజులలో డ్రైవర్లుగా శిక్షణ పొందిన మహిళా డ్రైవర్లు మహిళా రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పొందడం లో అగ్రభాగాన నిలుస్తారని తెలిపారు. ఈ శిక్షణ లో మహిళలు ముందుకు రావడం శుభపరిణామమని, అందులో భాగంగా ట్రైనీ మహిళా డ్రైవర్ గా అనకాపల్లి డ్రైవింగ్ స్కూల్ లో శిక్షణ పొందుతున్న మణి అనే మహిళ ను అభినందించారు. ఇప్పుడు డ్రైవింగ్ శిక్షణ పొందబోయే మహిళలు మగవారికి ధీటుగా ఉపాధి పొందడంలో ముందు ఉంటారని కొనియాడారు. ఇప్పటి వరకు అనకాపల్లి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా 173 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, వారు వివిధ చోట్ల ఉపాధి పొంది ఉన్నారని, ఇప్పుడు మరల 16 మందికి డ్రైవింగ్ నందు శిక్షణ పొందడానికి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ కు రావడం శుభపరిణామమని తెలిపారు. ఇంకా ఎవరైనా ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ నందు శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న యువతీ యువకులు అనకాపల్లి డిపో లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి డిపో మేనేజర్ హనుమశ్రీ , అసిస్టెంట్ మేనేజరు గౌరి ,డ్రైవింగ్ ఇన్సక్టర్ రమణ ,డ్రైవింగ్ స్కూల్ అసిస్టెంట్ ఏ .వి. బాపునాయుడు పాల్గొన్నారు.



## దివ్యాంగునికి ట్రై సైకిల్ పంపిణీ చేసిన ఎంపిపి రాజాన శేషు

**ఎలమంచిలి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** మండలంలోని జంపపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు రాపేటి వెంకటికి మండల పరిషత్ అధ్యక్షులు రాజాన సూర్య చంద్ర శేష గిరి రావు (శేషు) ట్రై సైకిల్ పంపిణీ చేశారు. పట్టణంలోని మండల పరిషత్తు కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయ సామగ్రిని అందజేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాని, జంపపాలెం జనసేన నాయకులు సతీష్ కుమార్, షేకులపాలెం నాయకులు ప్రగడ ఆనంద్, మండల ఉపాధ్యక్షులు భీముని శివాజీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సిఎస్ఆర్ నిధుల వినియోగం

**- ధర్మసాగరం చెరువులో యంత్రాలు గర్జన**

**రాంబిల్లి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త** రాంబిల్లి మండలం వెల్చూరు ధర్మసాగరం చెరువులో పూడిక తీస్తున్నారు, సుమారు 550 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే వెల్చూరు ధర్మసాగరం చెరువును సిఎస్ఆర్ నిధులు రూ 28 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు, ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో ఉన్న ఏషియన్ రంగుల పరిశ్రమ కమ్యూనిటీ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) పథకంలో ఈ చెరువు పనులు చేపట్టింది, ఈ చెరువు గర్భం విస్తీర్ణం మొత్తం 25.70 ఎకరాల్లో ఉండగా చాలావరకు ఆక్రమనకు గురైంది, కేవలం 8 ఎకరాలకు చెరువు కుదించకు పోయింది ఆక్రమణలు తొలగించకుండా చెరువు పనులు చేస్తుండడంతో సాగునీటి నిల్వలకు పెద్దగా ఉపయోగం ఉండదని రైతులు వాపోతున్నారు, వెల్చూరు ధర్మసాగరం చెరువుగా రాజ కోడూరు రెవెన్యూలో సర్వేనెంబర్ 240లో 14.70 ఎకరాలు వెల్చూరు రెవెన్యూ లో సర్వేనెంబర్ 195లో 11 ఎకరాలు ఉంది, రెవెన్యూ జల వనరుల శాఖల అధికారులు ఆక్రమణలు తొలగించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు, ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ కే. శివాజీ వద్ద ప్రస్తావించగా మార్చి నెల సమీపిస్తుండటంతో పనులు చేపట్టవలసి వచ్చింది అన్నారు, ఆక్రమణలు తొలగించే వరకు ఉంటే మంజూరైన సిఎస్ఆర్ నిధులు వెనక్కి వెళ్లిపోతాయని త్వరితగతిన పనులు సాగుతున్నాయని వివరణ ఇచ్చారు.



## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం.!

**(నక్కపల్లి ,ప్రభాతవార్త)** నక్కపల్లి మండల కేంద్రంలో స్థానిక జూనియర్ కళాశాల ఏపీ అంబేద్కర్ పాఠశాలలలో సోమవారం ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లు పరిశీలించి అనుమతించారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటిని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సిఐ జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో మహిళ ఎస్సై సాహిబా అంజుమ్ లు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రహదారులు దాటుతుండగా చర్యలు చేపట్టారు.

## పలనుకురాతిపాలెం గ్రామంలో ఎస్సై బి. వినోద్ అవగాహన కార్యక్రమం

**అడ్డతీగల, ఫిబ్రవరి23, ప్రభాతవార్త** అడ్డతీగల మండలం వేటమామిడి పంచాయతీ పనుకురాతిపాలెం గ్రామాన్ని సోమవారం అడ్డతీగల ఎస్సై బి వినోద్ సిబ్బందితో కలిసి సందర్శించారు. అక్కడి గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, వాటిని ఎవరూ ప్రోత్సహించవద్దని, గంజాయి, సారాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే అనర్థాలు గురించి అలాగే రోడ్డు ప్రమాదాల గురించి భద్రత గురించి వివరించారు.

# కనీసం వేతనం 26వేలు ఇవ్వాలని అంగన్వాడీలు వినతి

**నర్సీపట్నం,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**




కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలంటూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం నర్సీపట్నం ఐసిడిఎస్ పిఒకు అంగన్వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలక్సేషన్ ఇచ్చి మెయిన్సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యూటి అమలుకు గైడ్ లేన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథఖాలు అర్బన్, రూరల్ తేదీ లేకుండా అందరికీ అమలు చేయాలని చెప్పారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొం దించి అమలు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని అన్నారు. మే నెల అంతా వేసవి సెలవుల జీఓ వెంటనే ఇవ్వాలన్నారు. లబ్దిదారులకు బియ్యం, ఆయిల్, కందిపప్పు క్వాంటిటి పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని కోరారు.కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు రవణమ్మ, కార్యదర్శి మహాలక్ష్మి, సీనియర్ నాయకులు విసాప్రమాజ్యం, వరలక్ష్మీ, వెంకటలక్ష్మీ, వరలక్ష్మీ, భాగ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి పాల్గున్నారు.

# వ్యవసాయ అనుబంధ రంగాలకు 10శాతం నిధులు కేటాయించాలి

**నర్సీపట్నం,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**



రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయ అనుబంధ రంగాలకు కనీసం 10శాతం నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి బాబులు మాట్లాడుతూ రాష్ట్ర మొత్తం బడ్జెట్లో వ్యవసాయ అనుబంధ రంగాలకు కనీసం 10 శాతం మేర నిధులు కేటాయించి రైతులు, కౌలు రైతుల రక్షణకు వారి వ్యవసాయ కష్టాన్ని గుర్తించి రైతన్నను ఆదుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అత్యంత కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం, వ్యవసాయ రుణాలు ద్వారా ప్రతి రైతుకు పూర్తి స్థాయిలో అందించకపోవడం రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివలంక కొండలరావు, జి. గురుబాబు, కామిరెడ్డి లక్ష్మి, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాధాకృష్ణ, జిల్లా సమితి సభ్యులు అంకంరెడ్డి చిన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు**

**నర్సీపట్నం,ఫిబ్రవరి 23,ప్రభాతవా ర్త**




తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న సహకార సంఘం ఉద్యోగులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ కరోనా సమయంలో రైతులకు ప్రాథమిక స్థాయిలో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా సహకార ఉద్యోగులకు సేవలు అందించారన్నారు. 2019 మార్చిలో జీవో నెంబర్ 36 విడుదల చేసినా నేటికి ప్రభుత్వాలు సదర జీవో ను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఉద్యోగులకు టర్మ్ ఇన్సూరెన్స్ 20 లక్షల రూపాయలు చేయాలని, డివిడెంట్ రైతులకు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఏటీఎంలో కార్డు మార్చేసి మోసానికి పాల్పడ్డ నిందితుడు అరెస్టు

**- నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు**

**నర్సీపట్నం,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**



నర్సీపట్నం టౌన్ పరిధిలో ఏటీఎంలో కార్డు మార్చేసి మోసానికి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పీ.శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు.ధర్మసాగరం గ్రామానికి చెందిన సుకల సూకరాజు జనవరి 17న స్థానిక పాత ఆంధ్రా బ్యాంక్ వద్ద నగదు తీసుకునేందుకు వెళ్లాడు. ఏటీఎం ఉపయోగించడం రాకపోవడంతో అక్కడ ఉన్న గుర్తు తెలియని వ్యక్తి సహాయం చేస్తానని చెప్పి ఏటీఎం కార్డు తీసుకుని పీన్ తెలుసుకొని వేరే కార్డు ఇచ్చి మోసం చేశాడు. అనంతరం అసలు కార్డుతో రూ.15వేలు డ్రా చేసుకొని పరారయ్యాడు. ఈ మేరకు సూకరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా ముర్వ వీరయ్య చౌదరిని గుర్తించి సోమవారం ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో మళ్లీ నేరానికి ప్రయత్నిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. విచారణలో అతనిపై పలు జిల్లాల్లో కేసులు ఉన్నట్లు తెలిపారు. 2017 నుంచి సుమారు 20 కేసులు నమోదయ్యాయన్నారు. అతని వద్ద నుండి రూ.10వేల నగదు, 9 ఏటీఎం కార్డులు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టుకు తరలించామని చెప్పారు. ఏటీఎం సెంటర్లలో అపరిచితుల వ్యక్తుల సహాయం తీసుకోవద్దని సూచించారు. పిఎన్ నెంబరు ఎవరికి చెప్పరాదన్నారు. ఎవరి మీదనైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ షేక్ గఫూర్, ఎస్సై రమేష్, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.1.19 కోట్ల విలువైన 168 కేజీల గంజాయి పట్టివేత

**- ఐదుగురు అరెస్టు**

**నర్సీపట్నం,ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**



అక్రమంగా తరలిస్తున్న రూ.1.19 కోట్ల విలువైన 168 కేజీల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం డీఎస్పీ పీ.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నర్సీపట్నం రూరల్ పోలీస్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు నాతవరం మండలం వెదురుపల్లి గ్రామం దగ్గర వాహనాల తనిఖీ చేస్తుండగా రెండు బొలోరా వాహనాలు, ఒక కారు, ఒక బైకు అనుమానాస్పదంగా ఉండడంతో తనిఖీ చేశామన్నారు. అందులో బొలోరా వాహనాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక అరల్లో 168 కేజీలు గంజాయి పట్టుబడిందన్నారు. ప్రధాన సూత్రధారి గుళ్లపల్లి హరిబాబుతో పాటు మరో నలుగురును ఒడిస్సా నుండి గంజాయి కొనుగోలు చేసి ఒడిషా నుండి బయలుదేరి మల్కన్ గిరి, చింతపల్లి, రంపుల ఘాట్ రోడ్డు మీదుగా కత్తిపూడి జాతీయ రహదారికి చేరుకునే క్రమంలో పోలీసులకు చిక్కారన్నారు. ఈ మేరకు గుళ్లపల్లి హరిబాబుతో పాటు వంతల దేవిడ్, బండా ప్రభాకర్ రావు, వీరవల్లి దుర్గారావు, కొర్ర బంజుబాబులను అరెస్టు చేయగా మచ్చవరపు ప్రసాద్ వంతల ఎలియా పరారీలో ఉన్నారన్నారు. వారి వద్ద రెండు బలెరో, ఒక కారు, ఒక బైక్ తో పాటు 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్సై తారకేశ్వరరావు, కేడీపేట ఎస్సై రుషికేశ్వరరావు, నాతవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నమెంట్ను జయప్రదం చేద్దాం: టిడిపి నేతలు

**నక్కపల్లి, ప్రభాతవార్త**



పాయకరావుపేట నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జన్మదినాన్ని పురస్కరించుకుని"అనితమ్మ క్రికెట్ టోర్నమెంట్" నిర్వహించే నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేసే విషయంలో కృషి చేయాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం హోం మంత్రి అనిత నివాసంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం లో టోర్నమెంట్ విషయమై చర్చించారు. ఈ సమావేశం లో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో జరిగిన సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు లు కలసి విజయవంతం పై చర్చించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల కోసం చర్చించారు. ఈ కమిటీల్లో 33 మహిళలు ఉండేలా చూడాలన్నారు. తెలుగు యువతకు సంబంధించి 35 సంవత్సరాల వయసు గల యువకులు తెలుగు యువత కమిటీలో ఉండాలని సూచించారు. అలాగే టోర్నమెంట్ నిర్వహణ, జట్ల నమోదు, ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. మార్చి మొదటి వారంలో మ్యాచ్లు ప్రారంభం కానున్నాయి. ఈ టోర్నమెంట్లో మొదటి బహుమతిగా రూ.1,00,000, రెండో బహుమతిగా రూ.50,000 నగదు ప్రదానం చేయనున్నారు. అదనంగా పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి టీషర్టు అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ప్రాతిపదికన జట్లు ఏర్పాటు చేసి టోర్నమెంట్లో పాల్గొనవచ్చని వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడా స్ఫూర్తిని చాటాలని నాయకులు పిలుపునిచ్చారు. మ్యాచ్లు నక్కపల్లి హెటరో క్రీడా మైదానంలో నిర్వహించబడనున్నాయి. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి జట్లు నమోదు చేసుకుని టోర్నమెంట్ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి అదృశ్యం

**కసింకోట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త;**



మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న మంత్రి భవాని శంకర్ అనే విద్యార్థి అదృష్టమైనట్లు కశింకోట సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. భవాని శంకర్ అనకాపల్లి లోనే నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నారని తెలిపారు. నెల 19న ఇంటి నుండి కాలేజీకి బయలుదేరి అనంతరం తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. విద్యార్థి అదృశ్యం పై తండ్రి మంత్రి అర్జున్ రావు చుట్టుపక్కల గ్రామాలు, కుటుంబ సభ్యులను వాకాపు చేయగా ఎక్కడా లేదని నిర్ధారించుకొని కశింకోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తప్పిపోయిన విద్యార్థి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ స్వామి నాయుడు తెలిపారు.

# నూకాంబికా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణకు పద్మశాలీలకు అనుమతి

**అనకాపల్లి, పిబ్రవరి 23; ( ప్రభాతవార్త)**



అనకాపల్లి ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగ గా గుర్తింపు పొందిన, అనకాపల్లి శ్రీ శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారి కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీ పద్మశాలి సంక్షేమ సంఘం , ఉత్తరాంధ్ర పద్మశాలి సంఘం సంయుక్తంగా అనకాపల్లి జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యములో సోమవారం దేవలయట్రస్టీబోర్డు సభ్యులను కలిసారు. వచ్చే మార్చి 3న శుక్రవారం నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రములు సమర్పించుటకు శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కి, చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులకు దరఖాస్తు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రములు పద్మశాలీయులు సమర్పించుటకు ఆమోదించారు.,పద్మశాలి కుల బాంధవులు చేనేత పరిశ్రమ పెద్దలకు తెలియజేయడమైనది,ప్రతి సంవత్సరము శ్రీ శ్రీ శ్రీ నూకాంబిక అమ్మ వారికి ..పట్టు వస్త్రములు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో అమ్మవారికి తమ చేతుల పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. , ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పెద్దలు పొన్నగంటి అప్పారావు , ఆల్ ఇండియా ఖాదీ బోర్డు మాజీ సభ్యులు బిజెపి నాయకులు, విశాఖపట్నం జీఎంసి కోఆప్షన్ సభ్యురాలు మాజీ భీమిలి చైర్ పర్సన్ శ్రీమతి కొప్పల ప్రభావతి కొప్పల రమేష్ , సింహాచలం దేవస్థానం మాజీ బోర్డు సభ్యులు సూరిశెట్టి సూరిబాబు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీ పంపాన సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డి ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులురీ తిప్పాన అప్పారావు గారు, అనకాపల్లి శ్రీ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ గెద్దం దివ్య తేజ, డాక్టర్ యామిని కుమారి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఊర్లకులపాడు గ్రామాన్ని రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ పర్యటన

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాత వా ర్త**



ఉర్లాకులపాడుగ్రామంలో కిడ్నీ సమస్యతో జరిగిన మరణాలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి సోమవారం పర్యటించారు. ఉర్లాకులపాడు గ్రామంలో జరుగుతున్న వైద్యశిబిరాన్ని చూశారు. ఇదే గ్రామంలో భర్త, తల్లిని కిడ్నీ వ్యాధితో పోగొట్టుకున్న బాధలో ఉన్న కోసూరి గంగాభవాని ను పరామర్శించారు.కొంత నగదు సహాయాన్ని అందించారు. చిన్నారుల చదువుకు తోడ్పాటును అందిస్తానన్నారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న జర్తా వీరబాబు కుటుంబంతో బొజ్జిరెడ్డి మాట్లాడారు. కోసూరివారివీధి గ్రామాన్ని కూడా చూసారు. ప్రభుత్వ వైద్య సేవలను మాత్రమే పొందాలని గిరిజనులకు ఆయన సూచించారు. ఉర్లాకులపాడు గ్రామంలో సురక్షత త్రాగునీటి సమస్యను ఉందని బొజ్జి రెడ్డికి అక్కడ గ్రామస్థులు తెలిపారు. దాతలు సహాకారంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు కృషిచేసిన దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ డి.వి.డి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తొంటా ఆదిరాజు, మాజీ జెడ్.పి.టి.సి కోసూరి బుజ్జి చిన్నాలమ్మ, టిడిపి నేతలు గణజాల తాతారావు, వాసం శెట్టి గంగాధర్, తాము సూరిబాబు, డా.పావని, డా. నాగార్జున, డా. దేవిడ్, డా. నాగార్జున, ఆర్ డబ్ల్యూఎస్ జేఇ సీతారాం నాయక్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, వైద్య సిబ్బంది గొడుగు నాగవాసు, భూముల వెంకటరమణ, నీలాద్రి లక్ష్మి, కన్నయ్యమ్మ, రామలక్ష్మి, కుమారి, శేషారత్నం, హెల్త్ అసిస్టెంట్స్ కంచెం శ్యామ్యూల్, కోర్ల రాజబాబు, సింగిరెడ్డి పద్ధరాజు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# శిధిల భవనాల్లో భోజనాల్లోకి విద్యార్థులు రాకుండా చూడండి

**- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి**

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



శిదిలభవనాల్లోకి విద్యార్థులు వెళ్ళకుండా చూడాలని బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల పర్యవేక్షకులకు రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి సూచించారు. సోమవారం రాజవొమ్మంగి మండలంలో జడ్డంగి, బోర్నగూడెం గ్రామాల్లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మరుగుదొడ్లు, ఒక ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గుర్తించారు. సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడం, మరుగుదొడ్ల సమస్యలు గుర్తించారు. రెండు ఆశ్రమ పాఠశాలలో రికార్డులు, స్టోర్ రూమ్, విద్యాప్రగతిని పరిశీలించారు. విద్యార్థులకు భోజనాలను వడ్డించారు రెండు ఆశ్రమోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు బొజ్జిరెడ్డిని శాలువా లను కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు శైలజ, రమేష్ బాబు, వార్డున్ల సత్యనారాయణమ్మ, యం. రాజబాబు, ఉపాధ్యాయులు,, తాము సూరిబాబు పాల్గొన్నారు.

# కారుతో 100 కిలోలు గంజాయి స్వాదీనం.. ఒకరు అరెస్టు.. ఇద్దరు పరారీ

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాత వార్త**



పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం కిండ్ర జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం 100 కిలోలు గంజాయిని కారులో తరలి స్తుండగా వాహన తనిఖీల్లో పట్టుకొన్నట్లు రాజవొమ్మంగి ఎస్. ఐ శివకుమార్ తెలిపారు. ఎస్. ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోలీసులకు రాబడిన సమాచారం మేరకు వాహన తనిఖీలను చేయడం జరిగిందన్నారు. మారుతి జన్ నెంబర్ ఓ. ఆర్.18 6199 కారు అనుమానం రావడంతో 100 కిలోలు గంజాయి లభ్యమైనదని అన్నారు..గెజిటెడ్ అధికారులు సమక్షంలో నిర్ధారణ జరిపామన్నారు. కారుతో బాటు ఒడిస్సా రాష్ట్రం మల్కాన్ గిరి జిల్లా మెట్ట గూడ గ్రామానికి చెందిన ఎల్. ఖారా (44) సం. అనే వ్యక్తిని పట్టుకోవడం జరిగిందన్నారు. ఒడిస్సా నుండి రాజమండ్రి గంజాయి తరలిస్తున్నా రని అన్నారు. గంజాయితో పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసామన్నారు. ఒడిస్సా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారన్నారు.కేసు దర్యాప్తు జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్. ఐ శివకుమార్, ఆర్ డబ్ల్యూ ఎస్ జె. ఈ సీతారాం నాయక్, వీఆర్వో గొర్లె సూర్యకాంతం, ఏ. ఎస్. ఐలు రంగబాబు, చిన్నబ్బాయిరెడ్డి, రైటర్ జెవి రమణ, సిబ్బంది పాల్గొన్నారు

# బొరుగుపల్లి రహదారి కోసం కలెక్టర్కు గిరిజనులు మొర

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి పంచాయితీ రాజవొమ్మంగి నుండి వయ్యాడ గ్రామం మీదుగా బొరుగుపల్లి గ్రామం వరకూ ఉపాధిహామీ పథక రూ. 2.50 కోట్లు నిధులుతో చేపట్టిన రహదారి పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలివేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని సోమవారం రంపచోడవరం ఐ. టి. డి. ఏ ప్రజావాణిలో ఇన్ చార్జి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు వైస్సార్సీపీ నేతలు కనిగిరి దుర్గాప్రసాద్, నాగులపల్లి కుశరాజు ఆధ్వర్యంలో రెండు గ్రామాల గిరిజనులు అర్జీని ఇచ్చారు. ప్రస్తుతం రహదారి నడవడానికి ఇబ్బందికరంగా ఉందని కలెక్టర్ కు గిరిజనులు తెలిపారు. నిధులు రద్దు కాకుండా అదే కాంట్రాక్టర్ తో పనులను మొదలు పెట్టించాలని కోరారు. ఈకార్యక్రమంలో కనిగిరి దుర్గాప్రసాద్, నాగులపల్లి కుశరాజు, రెండు గ్రామాల 50 మంది గిరిజనులు పాల్గొన్నారు.

# పాఠశాలకు జిరాక్స్ మిషన్ బహుకరణ

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు జర్తా రామస్వామి స్కూల్ అసిస్టెంట్ గా ఇదే పాఠశాలలో పదోన్నతి పొందిన సందర్భంగా పాఠశాలకు రూ. 11 వేలు విలువ గల జెరాక్స్ మిషన్ను బహుకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని ఎ ఆదిలక్ష్మీ మాట్లాడుతూ జర్తా రామస్వామి తెలుగు పండిట్గా ఈ పాఠశాలకు రావడం జరిగిందని వచ్చిన కొద్దిరోజుల్లోనే, ఉపాధ్యాయునకు స్కూల్అసిస్టెంట్గా పదోన్నతి రావడం అభినందనీయమని అన్నారు.

# కిడ్నీ వ్యాధి నిర్ధారణ రిపోర్టు రావాలి: జిల్లా వైద్యాధికారిణి డా. సరిత

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి మండలం ఉర్లాకులపాడు గ్రామంలో ఫిబ్రవరిలో జరిగిన కిడ్నీ వ్యాధి మరణాలపై పత్రికల్లో వచ్చిన వార్తలకు గత మూడు రోజులుగా వైద్య శిబిరాలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం పోలవరం జిల్లా వైద్యాధికారిణి డా.సరిత ఆకస్మికంగా వచ్చారు. గ్రామంలో నీటి సమస్య ఉందని మహిళలు తెలిపారు. అనంతరం జడ్డంగి పి.హెచ్.సి.లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో డాక్టర్ సరిత మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి నిర్ధారణ రక్త పూత సేకరణ జరిపి కాకినాడ పంపామన్నారు. త్రాగునీరు శాంపిల్స్ ను కాకినాడ బయో కెమికల్ ల్యాబ్ కు పంపామన్నారు. రిపోర్టులు వచ్చేవరకు వివరాలను చెప్పలేమన్నారు. గ్రామంలో 186 గృహాల్లో 701 జనాభా ఉన్నారన్నారు.మూడు రోజుల పాటు 151 రక్తపూత సేకరణ చేసామన్నారు. బీపీ, షుగర్ వలన కూడా కిడ్నీ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్నారు. బీపీ, షుగర్ వ్యాధులకు ప్రాథమిక దశలో వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డా. పావని, డా. నాగార్జున, డా. శ్వేత, ప్రసాద్, ఎం.పి.హెచ్.ఈ.ఓ గొడుగు నాగవాసు, హెచ్.వి.లు భూముల వెంకటరమణ, నీలాద్రి లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ కంచెం శ్యామ్యూల్, కోర్ల రాజబాబు, సింగిరెడ్డి పద్దరాజు పాల్గొన్నారు.

# అంగన్ వాడి కార్మికుల రిలే దీక్ష

**డుంబ్రిగుడ:ఫిబ్రవరి: 23:( ప్రభాతవార్త):**



తమ న్యాయమైన సమస్యలు పరిష్కారిం చాలని కోరుతూ మండల కేంద్రంలో సీఐటీయ అద్వర్యలో అంగన్వాడీ కార్మికులు సోమవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా సూర్య నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తి గా విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం అయిన అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.కనీస వేతనం రూ 26.వేలు చెల్లించి, మినివర్కర్ల కు.మెయిన్ వర్కర్లుగా మార్చాలన్నారు.వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేసి, గ్రాడ్యుటి అమలు చేయాలినీ చెప్పారు. సూపర్ వైజర్ పోస్టులు భర్తీ చేసి మే నెలాంత వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలి..ప్రిస్కూల్ బలోపేతనం చేసి, తల్లికి వందనం పథకం వర్తింపు చేయాలని ఆయన కూటమి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కె కొం డమ్మ,జి పవిత్ర, టిసత్యవతి,వి రాద, లలిత,కె నీలమ్మ, అధికసంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

# కొత్తపాలెం గ్రామ సమస్యలపై జనసేన నేత సందర్శన..

**గూడెం కొత్తవీధి ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)**



అరకు పార్లమెంట్ పాడేరు జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు సాంస్కృతిక చైర్మన్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు జి కె వీధి మండలం, కొత్తపాలెం గ్రామాన్ని సందర్శించటం జరిగిందని జనసేన మండల ఉప అధ్యక్షులు బత్తుల సిద్ధార్థ్ మార్క్ తెలిపారు. సందర్శనార్థం గ్రామస్తులు గ్రామంలో ఉన్న ముఖ్యమైన సమస్యలను వివరించారని. గ్రామం లో నీటి కుళాయిలు లేవని, పీఎం జన్మన్ గృహాలు మంజూరు కాలేదని,36 మంది చదువుకునే పిల్లలు ఉన్న అంగన్వాడీ బిల్డింగ్ కానీ స్కూల్ బిల్డింగ్ కానీ లేదని తెలియజేశారు. కావున మా గ్రామం కొరకు అధికారులకు తెలియజేసి మాకు న్యాయం చేయమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీ కే వీధి మండల ఉప అధ్యక్షులు బత్తుల సిద్దార్ధ మార్క్, జి కె వీధి పంచాయతీ ఆర్గనైజర్ నాడెలి సత్తిబాబు, గ్రామ పెద్దలు పాంగి రాజు, చిట్టిబాబు ఇతర గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ వర్కర్లకు కనిసవేతనాలు 26 వేలు రూపాయలు పెంచాలి

**హుకుంపేట, ఫిబ్రవరి 23,ప్రభాత వార్త**



అంగన్వాడీ వర్కర్లకు కనిసవేతనాలు 26000 రూపాయలు పెంచాలని పెండింగ్ లో ఉన్న మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేస్తూ హుకుంపేట మండల కేంద్రంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణారావు మాట్లాడుతూ గతంలో అంగన్వాడీ వర్కర్లలు 42 రోజులు సమ్మె సందర్భంగా హామీ ఇచ్చిన సమస్యలు పరిష్కరించాలని కనివేతనం 26 వేలు రూపాయలు పెంచాలినీ మిగిలిన మినీ అంగన్వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని అసెంబ్లీ సమావేశలలో జీతాలు పెంచుటకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు జీ.కొండమ్మ,పీ.వసంత,వి.విజేత.డి.రాధ.టి. కృష్ణవేణి.కుమారితో బాటు ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకుడు పీ.లింగమూర్తి పాల్గొన్నారు

# హుకుంపేట ఎంపీడీవో రమాదేవిని వెంటనే తొలగించాలి

**- ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు డిమాండ్**

**హుకుంపేట, ఫిబ్రవరి 23,ప్రభాతవార్త**



హుకుంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎంపీడీవో పి. రమాదేవిని వెంటనే తొలగించాలని మండలంలోని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీపీ రాజబాబు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, ఎంపీటీసీలు, సర్పంచులు కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు పత్రిక ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్కు చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనలకు విరుద్ధంగా తమకు నచ్చిన వారికి బిల్లులు చేయించి, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఎంపీడీవో సమన్వయం లేకుండా పనిచేయడం విధులకు సక్రమంగా రాకపోవడం అభివృద్ధికి ఆటంకం కలిగించడం జరుగుతుందని వారన్నారు. అభివృద్ధి పనుల విషయంలో పారదర్శకత లేకుండా, చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా, రంగశీల సచివాలయానికి చెందిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయభాస్కర్ను ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా ఎంపీడీవో కార్యాలయానికి తీసుకువచ్చి, అన్ని అభివృద్ధి పనులపై కీలక బాధ్యతలు అప్పగించారని తెలిపారు. కాంట్రాక్టు పనులు నిర్వహించిన వారికి బిల్లులు చేయాల్సిన అధికారిక కీలు ఎంపీడీవో వద్ద ఉండాల్సి ఉండగా, అవి కూడా ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయభాస్కర్ చేతుల్లోనే ఉండడం తీవ్ర చట్టవిరుద్ధమని ఆరోపించారు. బిల్లుల విలువ నిర్ధారణ కావాలంటే తప్పనిసరిగా విజయభాస్కర్ను కలవాలంటూ ఉక్కుం జారీ చేస్తున్నారని, ఇది ప్రజాప్రతినిధుల హక్కులను హరించే చర్యగా వారు పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాల వల్ల మండల పరిషత్ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవోతో పాటు అక్రమాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లను వెంటనే తొలగించి, శాఖాపరమైన విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు డిమాండ్ చేశారు. అభివృద్ధి నిధుల వినియోగంలో పారదర్శకత తీసుకురావాలని వారు కోరారు.

# జై దుర్గా వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..

**ముంచంగిపుట్టు ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)**



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో జై దుర్గా వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగాయి. వర్తక సంఘం మాజీ అధ్యక్షులు నారం శెట్టి కిషోర్ ఆధ్వర్యంలో సోమవారం ఈ నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా వైశ్యరాజు. మధుసూదన్ రావు, ఉపాధ్యక్షులుగా అప్పల బత్తుల. వరాహ చారి, కార్యదర్శిగా ఊన్నా. ప్రభాకర్ రావు, సంయుక్త కార్యదర్శిగా బోనం రవికుమార్, కోశాధికారిగా అందవరపు. ప్రకాష్ రావు లు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నాయకులు మాట్లా డుతూ సంఘం బలోపేతానికి తమంత కృషి చేస్తామని అదేవిధంగా తోటివ్యాపారస్తులకు ఎటువంటి సమస్యఉన్న సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా అన్నారు.

# శివాలయం వద్ద అన్న సమారాధన

**రాజవొమ్మంగి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త**

జడ్డంగి గ్రామంలో శతాబ్దికి పైగా చరిత్ర గల పవిత్ర శైవక్షేత్రం శ్రీశ్రీశ్రీ భ్రమ రాంభికా మల్లిఖార్జునస్వామి ఆలయం వద్ద సోమవారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు అడపా కామేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. భారీగా భక్తులు శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## మండల సమావేశాల్లో కానరాని కూటమి భాగస్వామ్య పక్షాలు

### అధికారం కూటమిది.....ఆధిపత్యం ప్రతిపక్షానిది

గరివిడి ఫిబ్రవరి,23 ప్రభాత వార్త

మండల సమావేశాల్లో కూటమి భాగస్వామ్య పక్షాల సభ్యులు కాన రావడం లేదు.అధికారంలో ఉన్నా వారు జాడ సమావేశాల్లో దివిటీ పెట్టి వెదికినా కన్పించడం లేదు.అధికారం కూటమిది అయినా,ఆధిపత్యం మాత్రం ప్రతిపక్ష వైకాపా దే. అదే ప్రతీ మండల సమావేశంలో ను రుజువవుతోంది. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే నిర్ణయంతో వై ఎస్ ఆర్ సి పి పార్టీయులు ఏకపక్షంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్ని చోట్ల నామమాత్రపు పోటీతో గెలుపొందారు. ఇద్దరు ముగ్గురు సర్పంచులు మండలంలో టిడిపి మద్దతు తో గెలుపొందారు. ప్రాదేశిక సభ్యులు గెలిపొంద లేని స్థితిలో వారు ఎలాగూ సభలకు హాజరు కాలేరు. అయితే టిడిపి సానుకూల పరులైన సర్పంచ్‌లు ముగ్గురో నలుగురో ఉన్నప్పటికీ వారెవరూ సభలకు హాజరు కావడం లేదు.ఒక అమాయక టిడిపి సర్పంచ్ నిత్యం సభకు హాజరై అబాసుపాలవుతుంటారు.అలాగే నాలుగు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల సభ్యులు టీడీపీ వారే వారు హాజరుకి దూరంగా ఉంటున్నారు. ఇంకా ఎఎంసి చైర్మన్ గరివిడి మండల వ్యక్తే ఆయన కూడా సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. 90 రోజులు కి ఒకసారి జరిగే మండల సర్వ సభ్య సమావేశాలకు వారు దూరంగా ఉండటం వలన ప్రజా సమస్యలను ఏవిధంగా వారు గుర్తించి పరిష్కరిస్తారనేది ఆయా పదవులు అనుభవిస్తున్న వారికే తెలియాలి. ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే వారు సమావేశాల్లో పాల్గొనక పోతే ఎలా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజా సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేసే వేదికగా నిలిచే మండల సమావేశాలకే పాలక పక్ష సభ్యులు దుమ్మా కొడితే ఎలా అని ప్రజలు ఆయా దుమ్మా ప్రజాప్రతినిధులు కి ప్రశ్నిస్తూ ఉన్నారు. అధికారానికి దూరంగా ఉండే వారు సభలకు హాజరై ప్రజా సమస్యలపై గళం విప్పుతూ సమస్యలు పరిష్కా రించు కోకపోయినా కనీసం అధికారులు దృష్టి కి సమస్యలను నివేదిస్తూ ముందుకు సాగుతున్నారు. నాలుగు పి ఏ సి ఎస్ అధ్యక్షులు, నలుగురైదుగురు సర్పంచ్ లు,ఒక ఏ ఎం సి చైర్మన్ మండల సర్వ సభ్య సమావేశా లకు దూరంగా ఉండటంతో కూటమి సర్కారు ప్రతినిధులు సభల్లో తమ పాత్ర పోషించకుండా ప్రజా విశ్వాసానికి దూరమవుతున్నారని చెప్పక తప్పదు.ఇదే స్థితిలో ప్రతిపక్ష పార్టీ సమావేశాల్లో తమ ఆధిపత్యాన్ని కనబరుస్తూ ముందుకు సాగుతోంది. మండలంలో టీడీపీలో పదవులనుభవిస్తున్నవారు సమావేశాలకు దూర మవడం వలన సమస్యలపై చర్చ ఏకపక్షంగా సాగుతోంది.సమస్యలు నివేదించే అవకాశం కూడా ప్రతి పక్షానికే దక్కుతోంది. కూటమి సభ్యులు లేకపోవడంతో సభలో కూటమి ప్రతినిధులు పలచబడే ప్రమాదం లేకపోలేదు.భవిష్యత్తులో ప్రజామోదానికి దూరమయ్యే ప్రమాదమూ లేకపోలేదు. మండల సమావేశాలకు ఎప్పుడూ హాజరు కాలేకపోతున్న స్థానిక ఎమ్మెల్యే అయినా తాను లేని లోటుని ఇతర తమ పార్టీ సభ్యులు తోనైన లోటు తీర్చే ప్రయత్నం చేయడంలో బాగంగా వారిని మండల సమావేశాల్లో పాల్గొనాలని సూచిస్తే కొంతైనా ఆపార్టీ కి మేలు చేకూరే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి అధికార పార్టీయుల్లో ఏమేరకు స్పందన ఉంటుందో, అధినేతలు ఏ మేరకు ఆదేశాలు జారిచేస్తారో చూడాల్సి ఉంది.

## డ్రైనేజీ సమస్యపై శివరాం గ్రామ యువత కళ్ళకు గంతలు కట్టి నిరశన



గరివిడి ఫిబ్రవరి,23 ప్రభాత వార్త

మండలంలోని శివరాం గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై ఆ గ్రామ యువకులు కళ్ళకు గంతలు కట్టి వినూత్న నిరశన తెలిపారు. గత కొన్నిరోజులుగా నెలకొన్న సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో ఆగ్రామానికి చెందిన మిత్ర సేవా సంఘం సభ్యులు ప్ల కార్డులు పట్టుకుని, కళ్ళకు గంతలు కట్టి నిరశన తెలిపారు. గ్రామ రహదారి పై మురుగు నీరు నిల్వ ఉండే పరిస్థితి రావడం పై నిరశన కారులు ఆవేదన వ్యక్తం చేశారు.అనేక మంది పాద చారులు,వాహన చోదకులు, స్థానికులు రోడ్డు పై నీటి నిల్వ సమస్య తో ఇబ్బంది పడుతున్నారన్నారు.సమస్య కు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. నిరశనలో మిత్ర సంఘ అధ్యక్షుడు గవిడి రామకృష్ణ,సభ్యులు పిల్లా సత్యనారాయణ, తాడేల రాజారావు, జి.గొల్ల తదితరులు పాల్గొన్నారు.

## రామభద్రపురం రహదారిపై విద్యుత్ కాంతులు ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీ నాయన

రామభద్రపురం, ఫిబ్రవరి,23 ప్రభాత వార్త



పంచాయతీ బైపాస్ రహదారి వద్ద పంచాయతీ నిధులతో 10 లక్షలు వెచ్చించి సర్పంచ్ విద్యుత్తు లైట్లను ఏర్పాటు చేశారు ఈ పనులను ఎమ్మెల్యే బేబీ నాయనా ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ గతంలో బైపాస్ రహదారి వద్ద కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారి పక్కన విద్యుత్ లైట్లు గ్రామాల్లో సిసి రోడ్లు కాలువలు కోట్లాది రూపాయలతో నిర్మాణం చేయడం జరిగిందన్నారు మారుమూల ప్రాంతాల్లో తారు రోడ్లు నిర్మాణం చేయడం జరిగిందన్నారు రామభద్రపురం మేజర్ పంచాయతీలో చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పంచాయతీ పాలకవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు చింతల చిన్నమ్మ తల్లి వెంకటి రామి నాయుడు నల్ల భాస్కర్ రావు కేతిరెడ్డి నాయుడు తదితరులు కార్యక్రమంలో తెదేపా కార్యానిర్వాక కార్యదర్శి చింతల రామకృష్ణ గ్రామ సర్పంచ్ రవ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి : సిఐటియు డిమాండ్



పాచిపెంట, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త

అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం కనీసం వేతనం మంజూరు చేయాలని సిఐటియు నాయకులు కే ఈశ్వర రావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడి కార్యకర్తలు నాయకు రాలు కె పార్వతి దేవి డిమాండ్ చేశారు. సందర్భంగా వీరు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఇతర సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పిలుపులో భాగంగా 23, 24 తేదీలు రెండు రోజులపాటు పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కమిటీ నాయకులు ఎల్.దాలమ్మ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంగనవాడిలకు నెలకు 26000 కనీస వేతనం, 10,000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని రిటైర్ అయిన అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి చట్టం అమలు చేయాలని ఐసిడిఎస్‌ను ఏ రూపం లోనూ ప్రైవేటీకరించిన చేయకూడదని ఎఫ్ఆర్ఎస్ యొక్క ఈ కేవైసీ పేరుతో లబ్ధిదారులను తొలగించరాదని డిజిటలైజేషన్ ఎఫ్ ఆర్ ఎస్ పేరుతో అంగనవాడి వర్కర్స్ హెల్పర్లను వేధించకూడదని అన్నారు. ఐసిడిఎస్ కు సంబంధంలేని అదనపు పనులైన బిఎల్ఓ డ్యూటీలు పెన్షన్లు పంపిణీ చేయరాదని డిమాండ్ చేశారు .టీచర్లకు హెల్పర్లకు ఒకేసారి వేసవి సెలవులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాజకీయ వేధింపులు లేకుండా ప్రమోషన్ ఇవ్వాలని నాలుగు లేబర్ కోట్లు వాటి నియమాలను రద్దు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలని కోరారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ టి ప్రభావతి మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి మానుకొని వారి సేవలను గుర్తించాలని జనన మరణాల నుండి ప్రభుత్వ సేవలు ఎన్నో అందించిన అంగన్వాడీలను అన్ని విధాల ఆదుకోవాలని భవిష్యత్ పోరాటాలకు అంగన్వాడీ ఐక్యంగా పోరాడాలని ఉద్యమించాలని అన్నారు . గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్నీ రామయ్య ప్రాజెక్ట్ నాయకులు ఇందిరా సరోజిని సాయి పూజ సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు రజత పతకాలు సాధించిన కౌముది విద్యార్థులు..

శృంగవరపుకోట,ఫిబ్రవరి23, ప్రభాతవార్త

ఎస్.కోట కౌముది గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు బంగారు రజత సిల్వర్ పతకాలు సాధించారు.ఈనెల 21,22 తేదీల్లో విశాఖపట్నంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 31వ నేషనల్ ఇన్విటేషన్ కెన్యూరీ కరాటే చాంపియన్స్ పోటీల్లో కౌముది పాఠశాలకు చెందిన 3,4,5,6 తరగతులు చదువుతున్న విద్యార్థులు వి.హర్దిక్ వినయ్, సుదీక్ష,తేజస్వరూప్,గోవింద, తపస్య శర్మ,వి.సాహన్,నజీర్,జాషినీ, రిత్విక్,అపూర్వ్ లు పాల్గొన్నారు. వీరిలో కొందరు బంగారు,రజత,సిల్వర్ పతకాలు గెలుచుకున్నారు.ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శాంతి మోహంతి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని అప్పుడే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని తెలిపారు.అనంతరం ప్రిన్సిపాల్ తోపాటు ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.




## ప్రభుత్వానితో తాడోపేడో తేల్చుకుందాం.. అంగన్వాడీల ఉద్యమానికి కార్మిక సంఘాల మద్దతు..



చీపురుపల్లి ఫిబ్రవరి 23ప్రభాత వార్త

గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలన సమయంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు చేపట్టిన అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూని యన్‌కు మద్దతు పలికిన అప్పటి ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్న కనీసం అంగన్వాడీ సమస్యల పైన బడ్జెట్ సమావేశాల్లో ఎందుకు నోరు మెదపలేదని జిల్లా సిఐటియు నాయకులు అంబల్ల గౌర్నాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చీపురుపల్లిలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత పాలకుల మాదిరిగానే ప్రస్తుత పాలకులు కూడా అంగన్వాడీలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఈనెల 25 26 27 తేదీలలో భారీ నిరసన కార్యక్రమాలతో పాటు మార్చి 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. అంగన్వాడీల వేతనాలను కనీసం 26 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పెండింగ్లో ఉన్న 18 10 మినీ వర్కర్ల క్వాలిఫికేషన్ రిక్వెస్ట్ మేరకు విధి విధానాల రూపొందించి మెయిన్ సెంట్రల్ గా మార్చాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకించి అంగనవాడిలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. అదేవిధంగా గ్రాట్యూటీ అమలపైన విధి విధానాలతో కూడిన నిర్ణయాలు తీసుకొని మెడికల్ లీవ్లు కూడా ఇవ్వాలని కోరారు. పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మే నెలకి సంబంధించి వేసవి సెలవుల జీవితపాటు లబ్ధిదారులకు అందజేస్తున్న సరుకులను కూడా పెంపుదల చేయాలని కోరారు. అంగన్వాడీలకు అందజేస్తున్న మెనూ చార్జీలతో పాటు ఉచిత గ్యాస్ను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి మండలంలోని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నాగమణి ,మాలతి, పలువురు అంగన్వాడి వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ బ్రాహ్మణ సంఘం శ్రీ కనకమహాలక్ష్మికి సారి సమర్పణ

చీపురుపల్లి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త



చీపురుపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి సోమవారం సారీ సమర్పించారు. చీపురుపల్లి పట్టణంలో హట్కో కాలనీ నుంచి విశ్వబ్రాహ్మణ నాయకులు కుటుంబ సభ్యులతో కలిసి మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికీ సారిని సమర్పించారు . ఈ సందర్భంగావివిధ రకాల స్వీటీస్,పళ్ళు, పువ్వులు అమావారికి కానుకగా ఇచ్చారు ఈ కార్యక్రమం లో మండల విశ్వబ్రామీణ సంఘ పెద్దలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గున్నారు.

## ఏసీబీ నివేదిక ముసుగులో రైతులపై కక్ష సాధింపు:వైస్ ఎంపీపీ సుధారాణి



శృంగవరపుకోట, ఫిబ్రవరి23,ప్రభాతవార్త..

ఏసీబీ నివేదిక ముసుగులో రైతులపై కక్ష సాధింపు అన్యాయ మని ఎస్.కోట వైస్ ఎంపీపీ,రాష్ట్ర టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి తెలిపారు. సోమవారం బొడ్డవరలోని ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ సుమారు 74 ఎకరాల రైతు భూములపై జిందాల్ కంపెనీ కన్ను పడిందని చట్టాన్ని అడ్డం పెట్టుకుని దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఏసీబీ నివేదికను అడ్డం పెట్టుకుని సామాన్య రైతులను భయభ్రాంతులకు గురిచేయడంపై ఆమె మండిపడ్డారు. ఏసీబీ అనేది సాధారణంగా అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలని కానీ ఇక్కడ కేవలం సామాన్య రైతులను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు.కార్యక్రమంలో పలువురు నాయకులు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా రోటరీ క్లబ్ 121 టవ ఆవిర్భావ దినోత్సవం




బొబ్బిలి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

జాతీయస్థాయిలో నిస్వార్థ సేవలతో రోటరీ 121వ ఆవిర్భావ దినోత్సవం బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీహరి కార్యదర్శి శివకాంత్ ఆధ్వర్యంలో వసతి గృహం పిల్లలకు 36 వేల రూపాయలు విలువ 15 సీలింగ్ ఫ్యాన్ ను రోటరీ సభ్యులు అందజేశారు. మల్టీ డాన్స్ అకాడమీ బాలికలు దుస్తులు అందజేశారు మానసిక వైకల్యం కలిగిన విద్యార్థుల మరుగుదొడ్లు పాడైపో ఉండడంతో వాటి మరమ్మతులు చేయించారు. జిల్లా చైర్ జె సి రాజ్ మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ సంస్థ 1905లో అమెరికాలో ముగ్గురు వ్యక్తులతో పాల్ ఆరిసన్ స్థాపించాడని నేటికి 192 దేశాలలో సభ్యత్వం కలిగి 121 సంవత్సరాలుగా నాయకత్వం స్నేహము సహవాసాన్ని పెంపొందింప చేస్తుందని నిస్వార్థమైన సేవలను అందజేస్తున్న మా సంస్థ అన్నారు సమాజములో శాంతిస్థాపన రోగాలపై పోరాటము విద్యకు సహకారాన్ని అందించడం ప్రజల జీవనస్థితి గోతుల సాధకార్థ కల్పించడం వంటి కార్యక్రమాలతో సేవలు అందిస్తుందని అన్నారు.రోటరీ సభ్యులు శ్రీనివాసరావు జయప్రకాష్ ప్రవీణ్ రామకృష్ణ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో పకడ్బందీగా ఇంటర్ ఎగ్జామ్స్




సాలూరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ఇంటర్మీడి యట్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి.అందులో భాగంగా పట్టణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.అలాగే విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదులలో ఎటువంటి ఇబ్బంది లేకుండా వసతులు కల్పించారు. అంతే కాకుండా స్టూడెంట్స్ ఎగ్జామ్స్ రాస్తున్నప్పుడు మాల్ ప్రాక్టీస్‌కు ఎక్కడా అవకాశం లేకుండా కఠిన నిబంధనలు చేపడతామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.అలాగే కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని టౌన్ సీఐ అప్పలనాయుడు స్థానిక విలేకరులకు తెలిపారు.

## ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా?

### భయభ్రాంతులకు గురవుతున్న కాలనీవాసులు

మక్కువ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



మండల కేంద్రంలో జగనన్న కాలనీ సమీపంలో వెంగళరాయసాగర్ కుడి ప్రధాన కాలువ పై ఉన్న విద్యుత్ స్తంభం పైన టాప్ క్లిట్ విరిగి పక్కకు హై టెన్షన్ వైర్లు వేలాడుతూ ఉండటంతో అటువైపుగా వెళ్లే జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. చాలా నెలలుగా విద్యుత్ హై టెన్షన్ వైరు వేలాడుతూ ఉందని సంబంధిత స్థానిక లైన్మెన్ల దృష్టికి పలుమార్లు తెలిపినప్పటికీ వారెవరు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. విద్యుత్ వైరు ఎప్పుడు తెగి పడుతుందో అన్న భయం గుప్పెట్లో అటువైపుగా వెళ్తున్నామని కాలనీవాసులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్తు వైర్లను పునరుద్ధరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## కుక్కల దాడిలో మేకలు మృతి

### పలుమార్లు తెలిపినా పట్టించుకోని అధికారులు

మక్కువ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



మండలంలో దబ్బగడ్డ గ్రామంలో సోమవారం కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందాయి. దబ్బగడ్డ గ్రామానికి చెందిన మేకల కాపరి బండి లక్ష్మి పొలంలో సాయంత్రం మేకలను మేతకు తోలుకు వెళ్లగ వ్యవసాయ క్షేత్రంలో మేకలపై గుంపుగా కుక్కలు దాడి నాలుగు చంపేసాయి. మండలంలో పలుమార్లు మేకలను పశువులను కుక్కలు దాడి చేస్తున్నప్పటికీ అధికారులు వాటిని నివారించే చర్యలు చేపట్టకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతూనే ఉన్నాయి. తన జీవనాధారంగా మేపుకుంటున్న మేకలను కుక్కలు చంపివేయడంతో కాపరి లక్ష్మి బోరుణ విలపించారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆమె కోరారు.

## మండల కేంద్రంలో స్వైర విహారం:

మండల కేంద్రంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మండల కేంద్రంలో మాంసం దుకాణాలు నుండి వచ్చే మాంసం అవశేషాలు తిని కుక్కలు మాంసానికి బాగా అలవాటు పడ్డాయి. పలుమార్లు పంచాయతీ అధికారులకు ఈ సమస్య తెలిపినప్పటికీ పంచాయితీ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. రాత్రి సమయంలో వాహనదారులను కుక్కలు వెంబడిస్తూ పలు ప్రమాదాలు గతంలో జరిగాయి. ఇప్పటికైనా కుక్కల ను అదుపు చేసి ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.

## శ్రీమజ్జి గౌరమ్మ భద్రకాళి జాతరకు ఏర్పాట్లు

దత్తి రాజేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలంలోని పెదమానాపురం సంతలో శ్రీ మజ్జి గౌరమ్మ భద్రకాళి 21వ జాతర మహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని.ఆలయ నిర్వాహ కులు రౌతు జగదీష్ నాయుడు అన్నారు .ఆయన స్థానిక పాత్రికేయలతో మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ అనగాఆదివారం జాతర జరుపుటకు పండితులు నిర్ణయించారు ఆరోజు ఉదయం 5 గంటల నుండి రాపాక వెంకటరమణ శర్మ శ్రీనివాస శర్మ సోదరుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అభిషేకాలు ఘనంగా నిర్వహించబడును కావున భక్తులందరూ విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందుతారని కోరుచున్నాం అనంతరం రాత్రి 9 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతామని జాతర మహోత్సవ కార్యక్రమానికి కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు.

## అంగన్వాడీ సమస్యలు పరిస్కారానికై రిలే నిరహారదీక్ష

సాలూరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త




రాష్ట్రంలో అంగన్వాడీలకు కూటమి సర్కార్ జీతాలు పెంచి ఇతర సమస్యలు పరిష్కారించలని ఏపీ అంగ న్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ పిలుపు మేరకు పట్టణ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఆవరణలో రెండురోజుల రిలే నిరాహార దీక్షను యూనియన్ కార్యదర్శి కొల్లి గౌరీశ్వరి సీటూ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు సోమ వారం ఉదయం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తుచేసారు.అలాగే నేటికీ రెండేళ్లు అవుతన్న ప్రభుత్వం ఆలోచన చేయలే దని అందుకే జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వేతనాలు పెంచే నిర్ణయం తీసుకోవాలని ఇంకా పలు సమస్యలు పరిస్కరించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈనెల 25 నుండి 27న జిల్లా కేంద్రాలలో జరిగే కార్యక్రమాలలో అంగన్వాడీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.పార్వతి,అరుణ, తిరుపతమ్మ,పుష్పా,ఇందిర,అనసూయ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్య నేరము

పాచిపెంటపిబ్రవరి 23 ప్రభాతవార్త

బాల్యవివాహాలుకు ప్రతి ఒక్క తల్లిదండ్రులు స్వస్తి పలకాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి ప్రసాద్ రావు అన్నారు. బాల్య వివాహాలకు ప్రోత్సహిం చిన చట్ట రీత్యా నేరమని ఆయన అన్నారు. మండలంలో సోమ వారం పాంచాలి జడ్పీ హైస్కూలు పాచిపెంట గిరిజన బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమము జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. (మంచి స్పర్శ చెడు స్పర్శ) గురించి అవగాహన కల్పించారు. అలాగే పోలీసులు సేవలు టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. మహిళలపై వేధింపులు వన్ స్టాప్ సెంటర్ నుండి లభించే సేవలు గురించి మిషన్ వాత్సల్య పథకం నుండి అందించే సేవలు రెండు పాఠశాలలో పిల్లలు, సిబ్బందితో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో , సోషల్ వర్కర్ టి పి నాయుడు ఓ ఆర్ డబ్ల్యు అనిల్ వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శాంతి కుమారి ఓ పారా మెడికల్ వర్కర్ కళ్యాణి , పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.





## బెజ్జిపుట్టుగలో ఘనంగా గరుడ వాహన సేవ

కవిటి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)

మండలం బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసియున్న శ్రీ చక్ర పెరు మాల స్వామి డోల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామానికి చెందిన తెప్పల మాధవ రావు దంపతులచే గరుడ వాహన సేవ కార్యక్ర మం పురవీధుల్లో చేపట్టారు. వందలాది మంది భక్తులు శ్రీ చక్ర పెరుమాల స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పొందల కృష్ణారావు, పండ్రా రాంబాబు నాయుడు, స్థానిక సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి, గ్రామ పెద్దలు బార్ల జగన్నాథం, గుండ్యాల రామ్మూర్తి, బార్ల ధనుంజయంలతో పాటు పలువురు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## ఉద్దానం భగీరధుడు ఎర్రన్న : మాజీ జెడ్పిటిసి బెందాళం రమేష్

కవిటి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)



ఉద్దానం భగీరధుడు స్వర్గీయ కింజరాపు ఎర్రంనాయుడు అంటూ మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్ ముక్తకంఠంతో అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎర్రన్నాయుడు 69వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెందాళం రమేష్‌తో పాటు మాజీ జెడ్పీటీసీ పొందల కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు సీపాన వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్‌లతో పాటు పలువురు దేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వర్గీయ ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉద్దానం ప్రజల దాహార్తిని తీర్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరంగి మధు, మాజీ మండల కో ఆప్షన్ వాసుదేవ్ రౌలో, వజ్జ రంగారావు, తెప్పల మోహన్‌రావు, గోరకల రామారావు, మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన కార్యాలయం ప్రారంభం

టెక్కలి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఆసియాలోనే తమ రెండవ అతిపెద్ద కార్యాలయాన్ని బెంగళూరులో ప్రారంభించినట్లు అమెజాన్ ఈరోజు ప్రకటించింది. 1.1 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో, 12 అంతస్తుల్లో నిర్మించిన ఈ క్యాంపస్ ఈకామర్స్, ఆపరేషన్స్, పేమెంట్స్, టెక్నాలజీ మరియు సెల్లర్ సర్వీసెస్ (విక్రేతల సేవలు) వంటి వివిధ విభాగాలకు చెందిన 7,000 మందికి పైగా ఉద్యోగులకు వసతి కల్పిస్తుంది. కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో, ఐదు ఎకరాల స్థలంలో నిర్మించిన ఈ కార్పొరేట్ భవనాన్ని కర్ణాటక భారీ, మధ్యతరహా పరిశ్రమలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఎం.బి.పాటిల్ అధికారికంగా ప్రారంభించారు.

## నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన కూటమి ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



### జాబ్ క్యాలెండర్ జాడే లేదు

పాతపట్నం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఆకాశమంత ఆశలు చూపి, గద్దెనెక్కిన తర్వాత వారిని నట్టేట ముంచడం చంద్రబాబు నాయుడుకి వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండి పడ్డారు. సోమవారం విడుదల చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో, ప్రచార సమయంలో ప్రతి ఏటా జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు ఫిబ్రవరి ముగుస్తున్నా దాని ఊసే లేకపోవడం నిరుద్యోగులను వంచించడమే అని ఆమె పేర్కొన్నారు. హామీ ఇచ్చినప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయని నిలదీశారు. నిరుద్యోగ యువత ఓట్లతో గెలిచి ఇప్పుడు వారికి మొండిచేయి చూపడానికి సిగ్గు అనిపించడం లేదా అని ప్రశ్నించారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడమే కాకుండా, కొత్త నోటిఫికేషన్ల విషయంలో కాలయాపన చేస్తోంద న్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది యువత కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు చేస్తూ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాట మార్చడం వల్ల వారి భవిష్యత్తు అంధకారం లో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను మోసగించడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మరోసారి తన నైజాన్ని రుజువు చేసుకుందని, ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే మెగా డీఎస్సీతో పాటు అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరుద్యోగుల పక్షాన వైఎస్ఆర్‌సీపీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని రెడ్డి శాంతి తెలిపారు.

## ఘనంగా ఎర్రన్న జయంతి వేడుకలు



కంచిలి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

కంచిలి పంచాయతీ మఠం కంచిలిలో తెలుగుదేశం నాయకులు స్వర్గీయ ఎర్రంనాయుడు జయంతి వేడు కలు ఘనంగా జరుపుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఎర్రన్నాయుడు తన పదవీకాలంలో ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర వాణిని ఖండాంతరాలలో వినిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని రిలే నిరాహార దీక్ష



సీతంపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

అంగన్వాడీ కార్యకర్తలు వేతనాలు పెంచాలని నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో సీతంపేట ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షను అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టారు. జిల్లా సిఐటియు అధ్యక్షులు దావాలా రమణారావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారు. అయినప్పటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదు. అంగన్వాడి వేతనాలు తదితర సమస్యలు పరిష్కారం చేయాలని 2023 డిసెంబర్ నెలలో 42 రోజులు పాటు చారిత్రక సమ్మె జరిగింది. ఆ సందర్భంగా 2024 జూలై నెలలో జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం మినిట్స్ కాపీ కూడా ఇచ్చింది. అయినా నేటికీ జీతాలు పెంచలేదని ఆరోపించారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్‌గా అప్‌గ్రేట్ చేయడాన్ని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు సంతోషిస్తూనే మిగిలిన మినీలను మెయిన్‌గా మార్చాలని 2024లో గ్రాడ్యుయేట్ జీవో 8 ఇచ్చారు. నేటికీ సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ప్రకారం రూల్స్ రూపొందించ లేదని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో సీతంపేట ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు బి.పార్వతి, ఏ.దరిసమ్మ, ఏ.అంజలి, ఎన్.చంద్రమణి, సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, సిఐటియు సీనియర్ నాయకులు ఏ.భాస్కరరావు, గిరిజన సంఘం నాయకులు పి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## కింజరాపు ఎర్రన్నాయుడు 69వ జయంతి

మెళియాపుట్టి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు 69వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో దివంగత నేత, కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నయుడు చిత్రపటానికి శ్రీకాకుళం పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొదలవలస. రమేశ్ మరియు అధికార ప్రతినిధి పి ఎం జె బాబుతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన టిడిపి పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ(కార్యనిర్వాహక కార్యదర్శి) అనపాన రాజశేఖర్ రెడ్డి,శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాండ్రంకి శంకర్, పెద్ద పద్మాపురం సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్ తదితరులు పాల్గొని ఎర్రం నాయుడుకు ఘనంగా నివాళులర్పించారు.

## విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ఆముదాలవలస, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)



ఆముదాలవలస జూనియర్ సివిల్ కోర్టులో విధులను న్యాయవాదులు సోమవారం బహిష్కరించారు. ఇటీవల కర్నూలులో కోర్టు బార్ అసోసియేషన్ గా ఉన్న ఎం.పవన్ కుమార్ అనే న్యాయ వాదిపై కర్నూలు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న విక్రమసింహ న్యాయవాది అయిన పవన్ కుమార్‌పై దాడి చేసినందుకు నిరసనగా జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు నిరసన తెలుపుతూ విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా నిరసన తెలుపుతూ బార్ అసోసియేషన్ కార్యాలయం ముందు న్యాయవాదులు ఐక్యంగా ఉండాలని, కర్నూలులో పోలీసులు దౌర్జన్యం నశించాలని, న్యాయవాదిపై దాడి జరిపిన సిఐని విధులు నుండి బహిష్కరించాలని క్రమశిక్షణ చర్యలు పాటించాలని నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపు సత్యనారాయణ, సాధు ధనుంజయరావు, పైడి వరాహనరసింహులు, బొడ్డేపల్లి మోహన్ రావు, బురెల్లి సీతారాం, తమ్మినేని అన్నమనాయుడు, కె.వి రమణమూర్తి, గురుగుబెల్లి వెంకట్రావు,ఏ విజయ్ కుమార్ పి మోహన్ రావు, దోల రమణమూర్తి, వి. రాజేశ్వరరావులతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## గ్రామీణ రహదారులకు మహర్దశ

### టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ నిమ్మక పాండురంగ



వీరఘట్టం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయాలతో గ్రామీణ రహదారులకు మహర్దశ పడుతుందని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ నిమ్మక పాండురంగ అన్నారు. సోమవారం మండలంలోని నడిమికెళ్ల, కడకెళ్ల, కిమ్మి గ్రామాలలో సోమవారం రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన సోదరుడు నిమ్మక జయకృష్ణ మంజూరు చేసిన రహదారులకు ఆయన అట్టహాసంగా తమ కార్యకర్తలతో భూమి పూజ నిర్వహించారు. నడిమికెళ్లలో 10 లక్షలు రూపాయిలతో, మెయిన్ రోడ్ స్కూల్ నుంచి రైతుల పొలాలకు, అలాగే కడకెళ్లలో ఉమా రామలింగేశ్వర శివాలయంకు రహదారి కోసం 8 లక్షలు రూపాయిలతోనూ, అదేవిధంగా కిన్ని గ్రామంలోని ఏటి గట్టు నుండి శివాలయం వరకు నిర్మాణానికి 10 లక్షల రూపాయలతోనూ గ్రామ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన గావించారు. కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్ట్ చైర్మన్ ప్రతినిధి, పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు, ఉదయాన ఉదయ్ భాస్కర్, పట్టణ టీడీపీ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జనసేన జాని, నీటిసంఘం అధ్యక్షులు చింత ఉమా మహేశ్వర రావు, మాజీ నీటి సంఘము అధ్యక్షులు బళ్ళ హరిబాబు, నీటి సంఘము అధ్యక్షులు మాచర్ల నందిశ్వరరావు, తెలుగు యువత అనిల్, జామి సింహచలం, జంపు శేఖర్, చుక్కా శ్రీనివాస్, వండువ నీటి సంఘము అధ్యక్షులు కడగల గణపతి మాజీ సర్పంచ్ ప్రతినిధి మొద్ద వెంకటరమణ, కొంచాడ రామకృష్ణ నాయుడు, ఆలుబిల్లి ఉమామహేశ్వరరావు, గుండ్రెడ్డి రామకృష్ణ బలరాం స్వామి నాయుడు, మధు మరియు మండలం కూటమి నాయుకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త) :



ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఏటీఎఫ్ సభ్యులు సోమవారం నిమ్మాడలో కేంద్ర పౌర విమానాయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఏటీఎఫ్ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు సభ్యులకు వినతిపత్రం అందజేయటం జరుగు తుందని అందులో భాగంగా వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో మాట్లాడి ఉపాధ్యాయులకు టెట్‌నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చల్ల కేశవరావు, శ్రీనివాసరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి శతాబ్ది జాతర చరిత్రలో నిలుస్తుంది : కోండ్రు జగదీష్



రాజాం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

రాజాంలో రాష్ట్ర పండుగ శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 100వ వార్షికోత్సవ మహోత్సవ వేడు కలు మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో రెండవరోజు ఎంతో వైభవంగా కొన సాగుతోంది. రాజాం నియోజకవర్గం సీనియర్ తెదేపా నాయకులు కోండ్రు జగదీష్ భక్తులకు చేసే ఏర్పాట్లుపై నిరంతరం పర్యవేశిస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీక రించారు. ఈ సందర్భంగా కోండ్రు జగదీష్ మాట్లాడుతూ అమ్మవారి ఈ శతాబ్ది జాతర చరిత్రలో నిలు స్తుందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుండి మాత్రమే కాకుండా, ఒడిస్సా వంటి సుదూరప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో వస్తున్నారన్నారు. జాతరలో చేసిన ఏర్పాట్లపై భక్తులు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. మంచినీటి సదుపాయం, ప్రసాదాల పంపిణీ, మెడికల్ క్యాంప్‌లతో పాటు, భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు ఆకట్టుకుంటున్నాయన్నారు.

## 700 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



వీరఘట్టం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మండలంలోని హుస్సేనుపురం గ్రామ సమీపంలో నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ సిఐ సూర్యకుమారి ఆధ్వ ర్యంలో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 700 లీటర్ల బెల్లం ఊటలు వారు ధ్వంసం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా నాటు సారాను తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

## హెల్మెట్ వాహన పత్రాలు లేకుండా నడిపితే కేసు నమోదు



సీతంపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకుండా నడిపితే కేసు నమోదు చేయడం జరుగుతుందని సీతంపేట ఎస్సై వై.అమ్మనా రావు తెలిపారు. సోమవారం ఐటీడీఏ సమీపంలో వాహన పత్రాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వలన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వీటిని దృష్టిలో పెట్టుకొని హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు చేయవద్దని అలా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త) :

మండలంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడిట్ పరీక్షలు సోమ వారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 294 మంది విద్యార్థులు మొదటి ఇంటర్ పరీక్ష రాయాల్సి ఉండగా 11మంది గైర్హాజరు అయ్యారని డీవో ప్రసన్నకుమార్ తెలిపారు. 11మంది ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు. పరీక్ష కేంద్రంలో మంచినీటి సౌకర్యంతో పాటు పీహెచ్ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

## ఎర్రన్నకు ఘన నివాళులు

పాతపట్నం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:



పాతపట్నం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశానుసారం తెలుగుదేశం పార్టీ నాయకులు కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రం నాయుడు 69వ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎర్రం నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కోర్టు కూడలిలో గల ఎర్రంనాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ ఎర్రన్న అంటూ నినాదాలు చేశారు. తెలుగు తేజంగా వెలుగొందిన ఎర్రంనాయుడు జాతీయ రాజకీయాల్లో సిక్కోలు జిల్లాకు అపార గౌరవం తీసుకువచ్చారని, కేంద్ర మంత్రిగా పని చేసిన కాలంలో జిల్లా సర్వతోముఖ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ ప్రజాసేవకు ఎర్రన్న చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు పైల బాబ్జీ, పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్, నాయకులు శాసనపురి మధుబాబు, బండి రవివర్మ, అక్కంధ్ర సన్యాసిరావు, రఘుబాబు, మల్లిఖార్జున డాక్టర్ చిన్నయ్య, కలమట భుజంగరావు, కర్రెన్న, కుమార్ రెడ్డి, గిరి, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన భగత్ సింగ్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం

కొత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త




సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రతను అందించాలనే సత్సం కల్పంతో, జెమ్స్ ఆసుపత్రి వారి సహకారంతో శ్రీ భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ వారు సాయి సురక్ష ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం అత్యంత విజయవంత మైంది. ఈ శిబిరంలో సాధారణంగా బయట ఎంతో ఖరీదైన పలు వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. ముఖ్యంగా ప్రాణాంతక వ్యాధిని ముందస్తుగా గుర్తించే అత్యంత ఖరీదైన ప్రత్యేక క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, క్షయ వ్యాధి నిర్ధారణకు చేసే క్షార పరీక్షలు, గుండె పనితీరును తెలిపే ద్విమితీయ ప్రతిధ్వని పరీక్ష మరియు విద్యుత్ హృల్లేఖన పరీక్షలతో పాటు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చేసే పాప్ స్మియర్ పరీక్షలు, కంటి చూపు సమస్యలను గుర్తించే నయన వైద్య పరీక్షలను నిపుణులు నిర్వహించారు. ఈ శిబిరంలో కొత్తూరు మండల పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన మొత్తం 170 మంది రోగులకు వివిధ రకాల వైద్య తనిఖీలు చేసి, వారికి అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేశారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొని రోగులకు సేవలు అందిస్తూ శిబిరానికి పూర్తి సహకారం అందించారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# శ్రీకాకుళం వార్త



## గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారులు : ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్



కవిటి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త)

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పన కూటమి ప్రభుత్వం ధ్యేయం అంటూ ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్‌తో పాటు మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్, స్థానిక సర్పంచ్ ప్రతినిధి కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలం నెలవంక పంచాయతీ మధ్యపుట్టుగ గ్రామానికి 20 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. వారంతా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో తెలుగుదేశం ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా ముందంజలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ సేపాన వెంకటరమణ పిఎసిఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్‌లతోపాటు పలువురు దేశం నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ప్రజా గ్రీవెన్స్‌కు 26 వినతులు



సీతంపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

ఐటీడీఏ ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్‌లో 26 వినతులు వచ్చినట్లు ఏపీవో జి.చిన్న బాబు తెలిపారు. ఈ ప్రజా గ్రీవెన్స్‌లో మినీ ట్రాక్టర్లు పవర్ విడర్లు త్రాగునీరు సిసి రోడ్లు వంటి సమస్యలపై వినతులు వచ్చినట్లు ఏపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## రిలే నిరాహార దీక్ష చేస్తున్న అంగన్వాడీలు



కోటబొమ్మాళి ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త) :

తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఐటీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా సోమవారం అంగ న్వాడీ కార్యకర్తలు, ఆయాలు రిలే నిరాహార దీక్ష చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు నిరసనలు తెలియజేస్తున్న సందర్భంగా కోటబొమ్మాళిలో కూడా ఐసిడిఎస్ పిఓ ఆఫీస్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టామన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు, పెండింగ్‌లో ఉన్న సూపర్వైజర్ పోస్టులు, వేసవి సెలవులు, తదితర అన్ని పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు, గొండు నీలన్న, అంగన్వాడీ ప్రాజెక్టు నాయకులు యం.లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు ఆత్మీయ సత్కారం



ఆముదాలవలస, ఫిబ్రవరి 23, (ప్రభాతవార్త)

ఆముదాలవలస జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో ఇటీవల ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన సీనియర్ న్యాయవాది పైడి వరాహ నరసింహులుకు పదవి బాధ్యతలు నుండి వైదలిగిన మాజీ ఏజీపీ సీపాన గోవిందరావుకు, అలాగే మున్సిపల్ స్టాం డింగ్ కౌన్సిల్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన బాగాది గోవిందరావుకు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పని చేసి వైదొలిగిన మాజీ స్టాండింగ్ కౌన్సిల్ కింతలి త్రినాధరావుకు మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కనితి విజయలక్ష్మి భాయి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ మాట్లా డుతూ న్యాయవాదులు మరెన్నో పదవులు అలంకరించి పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు.సీనియర్ న్యాయ వాదులు సాదు ధనుంజయరావు, బురెళ్ళ సీతారాం, తమ్మినేని అన్నమనాయుడు, కెవి రమణమూర్తి, వి.రాజేశ్వరరావు, హనుమంతు అచ్చెన్నాయుడు, దోల రమణమూర్తి, సనపల ప్రసాదరావు, బి.మోహన్ రావు, కే.దామోదర్ రావు, అల్లాడ విజయ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పంచాయతీ అభివృద్ధి అధికారులపై ఒత్తిడిని తగ్గించండి

### ఎంపీడీవోకి వినతిపత్రం అందించిన సంఘ నాయకులు

వీరఘట్టం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :



పంచాయతీ అభివృద్ధి అధికారులు ఎదుర్కొంటున్న వివిధ రకాల ఒత్తిడి మరియు సమస్యలను తగ్గిం చాలంటూ స్థానిక ఎంపీడీవో బి.వెంకటరమణకు సోమవారం మండల పంచాయతీ అభివృద్ధి అధికారులు వినతిపత్రాన్ని అందజేశారు. వివిధ రకాల యాప్‌ల అమలు చేయడం వల్ల ఎక్కువగా కాలయాపన జరుగుతుండంతో పాటు, తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని దీని కారణంగా అనేక వ్యాధులకు గురవుతున్నామని వారు వాపోయారు. తక్షణమే పని భారాన్ని తగ్గించాలని వారు ఈ సందర్భంగా కోరారు. అలాగే ఇటీవల తీవ్ర ఒత్తిడి వలన మరణించిన పంచాయతీ అభివృద్ధి అధికారులు మరియు ఇతర సచివాలయ సిబ్బంది వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనాన్ని పాటిస్తూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వీరఘట్టం మండల సంఘం అధ్యక్షులు ఏ బంగారుబాబు, కోశాధికారి ఈ.చక్రధరరావు, కార్యదర్శులు కురిమినాయుడు, తిరుపతి, దశరధ్, మధు, మండల కార్యవర్గ సభ్యులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23 (ప్రభాతవార్త) :



దివంగతనేత కింజరాపు ఎర్రంనాయుడు జన్మదినం సందర్భంగా శిమ్మి నాయుడు చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజ్యంతో మండలం తిలారు గ్రామం వారి ఆధ్వ ర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, విశాఖ పట్నం సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తమోలజిస్ట్ జి.అరుణ 80 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించగా 35 మందికి కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. ఇంకా 2 కంటి పొరకి, 1 కంటి నరాలకి, 2 కంటి నల్లగుడ్డు, 1 చిన్న పిల్లల ఇబ్బందులకి రిఫర్ చెయ్యడం జరిగింది. అంతే కాకుండా ఉచితంగా మందులు కూడా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ యం. మనీషా, తర్ర రామ క్రష్ణ, ఎంపీపీ, తర్రా జనార్ధన్ రావు, ఆసుపత్రి వైద్య సిబ్బంది మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారికి ముఖ్యంగా పేదలకు వైద్య సేవలు చేరువ చేయాలనే ముఖ్య ఉద్దేశం తో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, సర్జరీకి ఎంపికైన వారందరికీ శంకర్ కంటి ఆసుపత్రి, విశాఖపట్నం బస్ ద్వారా తీసుకొనివెళ్లి ,ఆపరేషన్ చెసి మల్లి తిరిగి బస్ లో తిరిగి తీసుకొని రాబడును, ఈ కార్యక్రమం లో క్యాంప్ కోఆర్డినేటర్ సీహెచ్. అశ్వని కుమార్ వైద్య సిబ్బంది దీపికా పాల్గొన్నారు.

## ఘనంగా కింజరాపు ఎర్రంనాయుడు 69వ జయంతి వేడుకలు



కొత్తూరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

మహానీయుడు, మాజీ కేంద్ర మంత్రి కీర్తిశేషులు కింజరాపు ఎర్రంనాయుడు 69వ జయంతి వేడుకలు కొత్తూరు మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు ఎర్రంనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎర్రంనాయుడు రాజకీయాల్లో విలువలతో కూడిన ప్రజాసేవకు నిలువుటద్దమని కొనియాడారు. నిరంతరం ప్రజల కోసం శ్రమించిన ఆయన జీవితం నేటి తరం యువతకు మరియు రాజకీయ నాయకులకు ఒక గొప్ప స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తులసీ వరప్రసాద్ రావు స్పష్టం చేశారు. కూటమి నేతలు ఎర్రంనాయుడు ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిన విశేష కృషిని, ఆయనలోని నిబద్ధతను స్మరించుకున్నారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై ఈ జయంతి వేడుకలను గౌరవప్రదంగా నిర్వహించారు.

